సాహితీ గత వారంలో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ

: fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

26-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 295 పేజీలు: 8+16 వెల: 6.50



సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


# ఇక 'గ్రేటర్' విస్తరణ




మంగళవారం హైదరాబాద్‌లో కేబినెట్ వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, జూపల్లి, వాకిటి, అడ్లూరి

**ఒఆర్ఆర్ లోపల ఉన్న 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు జిహెచ్‌ఎంసిలో విలీనం**

మూడో డిస్కం ఏర్పాటు.. దాని పరిధిలోకి వ్యవసాయ కనెక్షన్లు

**రూ. 14,725 కోట్లతో అండర్‌గ్రౌండ్ కేబుల్ సిస్టం**

**జూబ్లీహిల్స్‌లో కొత్తగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్**

300 మె.వా సోలార్, 2000 మెగా పంప్డ్ స్టోరేజ్ పవర్ కొనుగోలుకు టెండర్లు

కేబినెట్ సమావేశం వివరాలు వెల్లడించిన డి. సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 25:** హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్‌రోడ్ లోపల బయట, ఓఆర్‌ఆర్ ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జిహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అందుకు అవసరమైన జీహెచ్‌ఎంసీ యాక్ట్, తెలంగాణ మున్సిపల్ యాక్ట్ లకు సవరణలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుమారు 4 గంటలకు పైగా సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం వివిధ అంశాలను చర్చించింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బోడుప్పల్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపాలిటీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లను, దమ్మాయిగూడ, నాగారం, పోచారం. ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ–జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లను, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల, ఆదిబట్ల, జల్‌పల్లి, శంషాబాద్, మణికొండ, తుక్కుగూడ, నార్సింగి మున్సిపాలిటీలను, సంగారెడ్డి జిల్ల పరిధిలోన బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ శాఖలో మరో డిస్కమ్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో >>2

# మోగిన పంచాయతి నగారా




డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు

**రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి 'కోడ్'**

**30 నుంచి నామినేషన్ల స్వీకరణ**

**పంచాయతీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్25:** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగరా మోగింది. ఈ మేరకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో 564 మండలాల్లో 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు ఎస్ఈసీ చెప్పారు. పంచాయతీ ఎన్నికలను డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లుగా రాణి కుముదిని వివరించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నాం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నియమావళి (కోడ్)అమల్లోకి వస్తుందని రాణి కుముదిని స్పష్టం చేశారు. 'సెప్టెంబర్ 29వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9వ తేదీన షెడ్యూల్‌పై హైకోర్టు స్టే విధించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1 కోటీ.66 లక్షల 55వేల 186 మంది >>2


డిసెంబరు 1నుంచి

## పార్లమెంటు

**ఈ నెల 30 న అఖిల పక్ష భేటీ**

**శీతాకాల సమావేశాలకు సర్వం సిద్ధం**

5



## ఆయోధ్యలో ఎగిరిన 'ధర్మధ్వజం'

2



సిద్ధించిన రామభక్తుల సంకల్పం: ప్రధాని నరేంద్ర మోడీ

**కాషాయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రధాని**

ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభం: సిఎం ఆదిత్యనాథ్



## వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

ఖరీఫ్, రబీలో 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం ఉత్పత్తి

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాత వార్త:** దేశ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో వరి పంట సాగుకు అనుకూల వాతావరణం ఉండటంతో పాటు, ప్రభుత్వ విధానాలతో గతేడాది 2024–25 సంవత్సరంలో తెలంగాణలో రికార్డుస్థాయిలో పంటల సాగు విస్తీర్ణం జరిగింది. ఖరీఫ్, రబీలో మొత్తం 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తయినట్లు అర్థ, గణాంక శాఖ నివేదికతెలిపింది. దేశంలోనే >>2




## 'గ్రీన్' హోదా కోసం 'గోల్డ్' వీసా

**అమెరికాలో అమలులోకి రానున్న కొత్త పథకం**

**వాషింగ్టన్, నవంబరు 25:** అమెరికాలో స్థిరపడాలనుకునే సంపన్న విదేశీయుల కోసం డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వీసా విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. దీనితోడు కాసులతో అమెరికా ఖజానాను శరవేగంగా నింపాలన్న ట్రంప్ లక్ష్యంతో అటు సుంకాలు ఇటు వీసా ఫీజులు రకరకరాల కొత్త వీసాలను అమలులోకి తెస్తున్నారు. భారీగా >>2

# రూ.8 వేల కోట్ల విద్యుత్ భారం!

చార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపునకు రెడీ

**వినియోగదారులపై బాదుడుకు డిస్కంల ప్రతిపాదన**



**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలపై భారం మోపేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సిద్ధమయ్యాయి. వివిధ పద్ధతులద్వారా దాదాపు 8 వేల కోట్ల రూపాయల మేర భారం వేయాలని ప్రతిపాదనలను సిద్ధం చేశాయి. వచ్చే 2026 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ, వ్యయ, అవసరాలపై (ఎఆర్ఆర్) ప్రతిపాదనలను ఈ నెలాఖరుకల్లా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు సమర్పించాల్సి ఉంది. ఈ క్రమంలో పంపిణీ సంస్థలు వినియోగదారులపై భారం వేసి తద్వారా నష్టాలను అధిగమించేందుకు నిర్ణయించాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని రెండు డిస్కంలు సుమారు 22 నుండి 23 వేల కోట్ల రూపాయల లోటులో ఉన్నాయి. దీన్ని కొంత మేర అధిగమించేందుకు విద్యుత్ ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపు తదితర వాటిని అమలు చేయడం ద్వారా వినియోగదారుల నుండి సుమారు 7 వేల నుండి 8 వేల కోట్ల రూపాయలను రాబట్టేందుకు ప్రతిసాదించినట్లు సమాచారం. ప్రధానంగా విద్యుత్ టారిఫ్‌లో మార్పులు చేస్తున్నాయి. ఏడాదిలో మొత్తాన్ని పరిగణలోకి తీసుకుని సగటున 50కి మించి 51 యూనిట్ల వాడకం నమోదైతే టారిఫ్‌ను యూనిట్‌కు ప్రస్తుతం ఉన్న 1.95 రూపాయల నుండి 3.10 రూపాయల వరకూ వసూలు వసూలు చేయనున్నాయి. అలాగే బి కేటగిరిలో సగటు వినియోగం నెలకు 101 యూనిట్లు అయితే ఇప్పుడు వసూలు చేస్తున్న 3.40 రూపాయల నుండి 4.80 రూపాయల శ్లాబ్‌లోకి మార్చనున్నాయి. అలాగే ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపు ద్వారానే 1,200 వేల కోట్ల రూపాయల మేర అదనపు భారం వేయనున్నాయి. విద్యుత్ వినియోగంతో సంబంధం లేకుండా, కనెక్షన్ లోడ్‌ను బట్టి ఫిక్స్‌డ్ ఛార్జీలను పంపిణీ సంస్థలు వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫిక్స్‌డ్ ఛార్జీల కింద ఒక్కో సర్వీసుకు లోడ్‌ను ఆధారంగా చేసుకుని కిలో వాట్‌కు 10 రూపాయలు చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి. దీన్ని 50 నుండి 60 రూపాయల వరకూ >>2



మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు, అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్

# 'తెలంగాణ రైజింగ్'కు తుదిమెరుగులు

సిఎం ఆధ్వర్యంలో 30 తేదీ దాకా రోజూ సమీక్షలు

పాల్గొననున్న డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్క, అజారుద్దీన్, పొంగులేటి, కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,నవంబర్25:** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు తుది మెరుగులు దిద్దుతారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వరుసగా ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. 25న సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో–సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. 26న లాజిస్టిక్స్, ఏర్పాట్లు: సీఎంతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో పాటు సంబంధిత అధికారులు పాల్గొంటారు. 27న మౌలిక వసతులు, అభివృద్ధి: సీఎంతో పాటు మంత్రులు వివేక్ >>2

# నేనే సీనియర్

-మంత్రి ఉత్తమ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్25:** ప్రస్తుత శాసనసభలో తానే సీనియర్ అని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తనకంటే సీనియర్ అయినప్పటికీ సభకు రావడం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం అసెంబ్లీకి వచ్చే వారిలో మాత్రం తాను సీనియర్ నాయకుడినని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో ఈ విషయమై ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఏడుసార్లు ఒకే పార్టీ బీఫామ్‌పై గెలిచిన వ్యక్తిని తానే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కెసిఆర్ వివిధ పార్టీల నుంచి గెలిచారని అలాగే కెసిఆర్ కామారెడ్డిలో ఓడిపోయారని గుర్తు చేశారు. తాను మాత్రం ఎప్పుడూ ఓడిపోలేదని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి రెండు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని ఆయన అన్నారు. కోడాడలో జరిగింది లాక్ అప్ డెత్ కాదని, ఆయనపై సిఎంఆర్ఎఫ్ చెక్స్ ఫ్రాడ్ కేసు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిసిసి అధ్యక్ష పదవులు వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సూర్యాపేట డిసిసి పదవి తమకు ఇస్తామన్నారని, అయితే తామే ఆ పదవిని వద్దనుకున్నామని ఉత్తమ్‌రెడ్డి పేర్కొన్నారు.

# సమాచారం లీక్

విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం: మంత్రి శ్రీధర్ బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్25:** తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాలు, కేబినెట్ లో జరిగిన చర్చల సారాంశం మొత్తం ప్రతిపక్ష నేతలకు చేరవేస్తున్న లీకు వీరుల విషయంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. మంగళవారం సెక్రటేరియట్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి సాయంత్రం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు స్పందిస్తూ ఈ లీకుల విషయం మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చిందని కేబినెట్ నిర్ణయాలు, ప్రభుత్వ నిర్ణయాల(గవర్నమెంట్ ఇన్‌ఫర్మేషన్) లీక్‌లపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో కేబినెట్ సైతం ఇదే ఆలోచనతో ఉందన్నారు. కేబినెట్ నిర్ణయాలు చాలా కాన్ఫిడెన్షియల్ అని అలాంటిది ఇంకా జీవోలు రాకముందే వాటి సారాంశం ఇతరులకు చేరవేడం అంటే అలాంటి ఘటనలపై విచారణ జరిపి చర్యలు >>2

# కంగుతిన్న కర్రెగుట్టలు!

**10 వేల మంది భద్రతా బలగాలతో రెండు, మూడు నెలల పాటు ఉధృతంగా 'సెర్చ్'**

ఎన్‌కౌంటర్లలో 30 మందికి పైగా మావోయిస్టులు మృతి.. లొంగిపోయిన డజన్ల మంది

ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో 280 చ.కి.మీ. మేర వ్యాపించిన కర్రెగుట్టలు

**కొత్త బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్న కేంద్ర బలగాలు**



**చర్ల, నవంబర్25, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన నారాయణపూర్ కాంకేర్ దంతెవాడ బీజాపూర్ సుకుమా జిల్లలో గత నాలుగు దశాబ్దాలుగా ఎదురులేని శక్తుగా ఏకచక్రాదిపత్యంతో అక్కడి ప్రభుత్వంతో పాటు జనతర ప్రభుత్వం ఏర్పాటు సామాంతర పాలన సాగించిన మావోయిస్టులకు నేడు గడ్డు పరిస్థితులు ఎదురౌతున్నాయి. కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టుల నిర్మూలన చివరి అంఖానికి చేరిందని చెప్పవచ్చు గత రెండేళ్ల కాలంలో మావోయిస్టుల ఏరివేతకు ప్రణాళికా బద్ధంగా అడుగులు వేసింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాలలో ప్రతి మూడు కిలోమీటర్ల కు ఫార్వడింగ్ ఆపరేషన్ బేస్ (ఎఫ్ ఓ బి)లను ఏర్పాటు చేసారు. ఆయా క్యాంపుల ద్వారా నిత్యం సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతలైన అబూజ్ మడ్ నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలో వరుస సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. మరోవైపు తెలంగాణా సరిహద్దు ప్రాంతాలలో బేస్‌ల ఏర్పాటుచేసి మావోయిస్టులపై >>2

# కంగుతిన్నకర్రెగుట్టలు!

>> ముప్పేట దాడిచేసారు. ఈ క్రమంలో వరుస ఎన్ కౌంటర్లు జరిగి అనేక మంది మావోయిస్టు కేంద్రకమిటి సభ్యులు అగ్రనేతలు మృతిచెందారు. ఉద్యమాన్ని నడిపించే ముఖ్యనేత నంబాల వంటి నాయకులు మృతిచెందారు. ఇక ఒకే ఒక్క షెల్టర్ జోన్‌గా ఉన్న కర్రిగుట్టల్లో మావోయిస్టు నేతలు కేడర్ తలదాచుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్న అవ్వడంతో ఆపరేషన్ కర్రెగుట్టలు చేపట్టారు. ఆపరేషన్ కర్రిగుట్టలుమావోయిస్టులే లక్షంగా చేసుకొని కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. కర్రిగుట్టలను టార్గట్ చేసి సిఆర్ పిఎఫ్ కోబ్రా డిఆర్జీ ఎస్టీఎఫ్ బలగాలు సూమారు మూడు రెండునెలలపాటు 10 వేల మంది భద్రతా బలగాలతో భారీ ఆపరేషన్ చేపట్టింది. కర్రెగుట్టలు 280 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం చత్తీస్‌గఢ్ తెలంగాణ రాష్రాలలో విస్తరించి ఉండటం నిటారైన గుట్టల్లో సెర్చ్ ఆపరేషన్ పెద్ద సవాల్ గా మారింది. ఆపరేషన్ జరిగిన రెండు నెలలపాటు హెలికాప్టర్లు డ్రోన్లు థర్మల్ ఇమేజింగ్ వంటి అత్యాధుని పద్దతిలో నిఘా ఉంచి ఆపరేషన్ నిర్వహించారు. ఆ ఆపరేషన్ వేసవికాలం కావడంతో అక్కడ కూబింగ్ భద్రతా బలహాలకు సవాల్‌గా మారింది. ఎంతో మంది అనార్యంపాలైనా సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు. ఎన్ కౌంటర్లో ముప్ఫైకి పైగా మావోయిస్టులు మృతిచెందారు. ఆపరేషన్ కొనసాగుతుండగానే పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం దీంతో కర్రిగుట్టల్లో ఉన్న భద్రతా బలగాలను వెనక్కి రప్పించింది. దీని వలన మావోయిస్టులకు కొంత ఉపశమనం కలిగింది. కర్రెగుట్టల్లోని గుహల్లో దాగి ఉన్న నక్సల్స్ ఇక మనుగడ కష్టతరం అని భావించి లొంగుబాటు ఉపక్రమించారు. మరికొందరు అనేక ధఫల్లో జరిగిన ఎన్ కౌంటర్లలో మృతిచెందగా కేంద్ర కమిటి సభ్యులు ఆశన్న మల్లోజులు రాష్ట కమిటి సభ్యులు చంద్రన్న బండి ప్రకాష్ ఆజాద్ మరికొందరు ముఖ్యనేతలు వివిధ కేడర్లకు చెందిన నాయకులు సభ్యులు భారీగా లొంగిపోయారు. అయితే ఆపరేషన్ కర్రిగుట్టల సమయంలో అక్కడ బేస్ క్యాంపుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాధ్యపడలేదు. వర్షాకాలంలోను సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు సత్ఫలితాలు సాదించారు. కర్రిగుట్టలను షెల్డర్ జోన్ ఏర్పాటు చేసుకొని మరికొంత మంది మావోయిస్టులు ఉన్నారని వారిని సైతం కట్టడి చేసేందుకు నూతనంగా రెండు బేస్ ల నిర్మాణం చేపట్టగా నూతనంగా వాజేడులో మరో బేస్ ను ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం ఆయా బేస్ ల ద్వారా కర్రిగుట్టల్లో సెర్చ్ ఆపరేషన్ భద్రతా బలగాలకు సులభతరం కాగా మావోయిస్టుల మనుగడ మరింత ప్రశ్నార్ధకంగా మారనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 30 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని ప్రకటించిన గడువులోపే మావోల అంతం తప్పగా అన్న సందేహాలు విష్లేషకుల్లో వ్యక్తం అవుతుండగా మావోల అంతం సాద్యంకాదని ఉద్యమానికి అంతం ఉండదని మారో మార్గంలో నూతన విప్లవానికి నాంది పలుకుందని మేధావి వర్గాల వాధనలు వినిపిస్తున్నారు. చత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో నిలవైవున్న అపార ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు దారదత్తం చేసేందుకు అక్కడ అడ్డుగా ఉన్న నక్సల్స్ తొలగిస్తే ఖనిజ సంపద తరలింపుకు మార్గ సుగుమం అవుతుందని భావించి ఆపరేషన్ కగార్‌లో భాగంగాఆపరేషన్ కర్రెగుట్టలు చేపట్టిం దని మానవ హక్కులసంఘాల నేతలు మేధావి వర్గాల వాధన మరో వైపు ఇప్పటికే ఖనిజ సంపద తరలింపుకు భారీఎత్తున అడవుల్లో యంత్రాలకు చెప్పారని పచ్చని అడవితల్లి ఎర్రనేలగా మారుతుందని సోషల్‌మీడియా విషయం చక్కర్లుకొడుతుంది. ఏమైనప్పటికీ అపరేషన్ కర్రిగుట్టలతో మావోయిస్టుల మనుగడ మరింత కష్టతరం కానుంది.

## వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

>> అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి పంట వేయడంతో దిగుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయి. గత రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 16 లక్షల హెక్టార్లు కాగా, గతేడాది ఏకంగా 24.04 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. 2023-24లో రాష్ట్రంలో 168.75 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగింది. తదుపరి ఏడాది 2024-25 అంతకు ముందు ఏడాది వచ్చిన దిగుబడిని అధిగమించి 183.57 లక్షల టన్నులు అదనపు ఉత్పత్తి సాధించిందని వివరించింది. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ తర్వాత వరుసగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ ఉన్నాయి.

## 'గ్రీన్' హోదా కోసం 'గోల్డ్' వీసా

>> ఆర్థిక సహకారం అందించే వారికి శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కల్పించే 'గోల్డ్ కార్డ్' పథకాన్ని త్వరలో ప్రారంభించనుంది. దీనికి సంబంధించిన దరఖాస్తు ఫారంఐ-140బి ముసాయిదాను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనకు పంపింది. అన్ని అనుమతులు లభిస్తే, డిసెంబర్ 18 నాటికి ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోల్డ్ కార్డ్ అంటే ఈ కొత్త పథకం కింద, అమెరికాకు గణనీయమైన ప్రయోజనం చేకూర్చగలరని భావించే వ్యక్తులకు శాశ్వత నివాస హోదా కల్పిస్తారు. దరఖాస్తుదారులు తిరిగి చెల్లించని ప్రాసెసింగ్ ఫీజుతో పాటు వీసా ఆమోదం పొందాక మిలియన్ డాలర్లను (సుమారు రూ. 8.3 కోట్లు) ప్రభుత్వానికి కానుకగా చెల్లించాల్సి ఉంటుంది. కార్పొరేట్ సంస్థల ద్వారా దరఖాస్తు చేసుకునే వారికి ఈ మొత్తం 2 మిలియన్ డాలర్లుగా ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజుగా 15,000 డాలర్లు వసూలు చేస్తారు. దీంతో పాటు, 5 మిలియన్ డాలర్ల కానుకతో 'ప్లాటినం కార్డ్' ఆప్షన్‌ను కూడా తీసుకువస్తున్నట్లు తెలిసింది. దీని ద్వారా విదేశీ ఆదాయంపై పన్ను మినహాయింపులు ఉంటాయి.

## ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం

### రాజ్‌భవన్‌లో తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్ (ఫేజ్ 2) ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్25:** ఆశాజనక వృద్ధి కేంద్రాలుగా మారుతున్న ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం అయ్యేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. డిజిటల్ కనెక్టివిటీ, ఎంటర్ప్రెన్యూర్షిప్, టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్, లైఫ్ సైన్సెస్, బయో ఇన్నోవేషన్, రూరల్ గ్రోత్ తదితర రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందిస్తామన్నారు. మంగళవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ సమక్షంలో జరిగిన"తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్(ఫేజ్ 2)" ప్రారంభోత్సవంలో ఆయన విశిష్ఠ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ప్రాంతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకునే గొప్ప మనస్సు తెలంగాణ ప్రజలది అని వివరించారు. కనెక్టివిటీ, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లాంటి సవాళ్లను సైతం అధిగమించి డిజిటల్ అక్షరాస్యత, ఐటీ స్కిల్లింగ్, ఫిన్ టెక్, డిజిటల్ సర్వీస్ లను ఈశాన్య రాష్ట్రాలు అందిపుచ్చుకుంటున్నాయన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భావితరాల అవసరాలకు అనుగుణంగా నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా రేపటి తెలంగాణ కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్, ఏఐ ఇంటిగ్రేటెడ్ అకడమిక్ కరిక్యులం... కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చుతాయన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో స్టార్టప్ లను ప్రోత్సహించేందుకు టీ హబ్ తరహాలోనే "వన్ బయో" పేరిట ప్రత్యేక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

# రూ.8 వేల కోట్ల విద్యుత్ భారం!

>> పెంచాలనే ఆలోచనలో ఉన్నాయి. ఈ విధంగా పెంచడం వల్ల ఒక్కొక్క సర్వీస్‌పై సగటున 200 రూపాయల వరకూ నెలకు భారం పడనుంది.

**సింగరేణిలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్**

పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో మందమర్రి ఏరియాలో గల తన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ కు అనుబంధంగా ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఇది ఒక మెగావాట్ సామర్థం కలిగిన ప్రయోగాత్మక ప్లాంట్. దీనిని రెండు మూడు రోజుల్లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే తన ఏరియాల్లో 245.5 మెగావాట్ల సామర్థం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఈ విధంగా ఉత్పత్తి చేసే విద్యుత్తును తెలంగాణ ట్రాన్స్ కో గ్రిడ్ ద్వారా అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు. అయితే సింగరేణిలో డిమాండ్ లేని సమయాల్లో ఉత్పత్తి అవుతున్న సోలార్‌విద్యుత్‌ను గ్రిడ్కు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. ఇలా మిగిలిపోయిన సోలార్ విద్యుత్తును పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా నిల్వ చేసి గరిష్ట విద్యుత్ వినియోగం ఉండే సమయంలో కంపెనీ అవసరాలకు వినియోగించడం జరుగుతుంది. సాంకేతిక "పరంగా బీఈఎస్ఎస్ అత్యాధునికమైన సోలార్ విద్యుత్తు నిల్వ మరియు పొదుపు వ్యవస్థగా పేర్కొనవచ్చు. సుమారు 2.73 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వలన సింగరేణి సంస్థ ఏడాదికి సుమారుగా వినియోగించబ డని 9.1 లక్షలయూనిట్ల సోలార్ విద్యుత్తును సద్వినియోగం చేసుకుంటూ 70 లక్షల రూపాయల వరకుఆదా చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

## వారం - వర్జ్యం

**26-11-2025, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**మార్గశిరమాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, శుక్లపక్షం**
షష్ఠి రా. 11.59
శ్రవణ రా. 1.30,అనూరాధ కార్తె
వర్జ్యం : తె.5.40-7.20
దు.ఉ.11.33-12.18
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు. వాహనాలు, స్థలాలు, గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**వృషభం:** ప్రముఖులను కలుసుకుని ముఖ్యమైన విషయాలపై సంప్రదింపులు జరుపుతారు. మీరు చెప్పిందే వేదంగా ఉంటుంది.

**మిథునం:** శత్రువర్గం మరింత విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. నరఘోష అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** బాధ్యతలు నెరవేర్చి ప్రశంసలు పొందుతారు. విద్యార్థులు అధిక శ్రమను కనబరచ వలసి ఉంటుంది.

**సింహం:** వివాదాలతో కన్నా సామరస్యంగా వ్యవహరించడం వల్లనే పనులు సానుకూల పడతాయి. వాహన యోగం కలదు.

**కన్య :** మరుగున పడిన సమస్యలు ఒక్కొక్కటిగా ముందుకు వస్తాయి. అయితే పరిష్కార మార్గాలు వెనువెంటనే లభిస్తాయి.

**తుల :** దూరప్రాంత ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు. వస్త్రలాభం కలుగుతుంది.

**వృశ్చికం:** కీలకమైన వ్యవహారాలలో తీసుకునే నిర్ణయాలు, పెట్టుబడులు వంటి అంశాలు వాయిదా వేయండి.

**ధనుస్సు:** ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు. వ్యవహారాలలో పురోగతి ఉంటుంది. స్థిరాస్తిని వృద్ధి చేసుకుంటారు.

**మకరం:** ఉద్యోగంలో చికాకులు తొలగుతాయి. కారణం లేకపోయినా మనస్సు మారుమూలలో అప్రశాంతత. కాంట్రాక్టులు చివరిలో దక్కించు కొంటారు.

**కుంభం:** ప్రకటనలు లాభిస్తాయి. ప్రచార మాధ్యమాలకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. ప్రయాణాలు సౌకర్యంగా వుంటుంది.

**మీనం:** ఏదో సాధించాలి! ఏంతో చేయాలనే తపనను కలిగి ఉంటారు. దీఐర్ఘకాలిక ఋణాలు తీరుతాయి. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్






# అయోధ్యలో ఎగిరిన 'ధర్మధ్వజం'

### సిద్ధించిన రామభక్తుల సంకల్పం: ప్రధాని మోడీ
### కాషాయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రధాని
### ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభం: సీఎం ఆదిత్యనాథ్

**అయోధ్య, నవంబరు 24:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఎంతోకాలంగా వేచి చూస్తున్న రామాలయ ధ్వజారోహణం ఘనంగా జరిగింది. గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆవిష్కరించారు. సీతారాముల కల్యాణం జరిగిన మార్గశిర మాసం శుక్లపంచమి రోజున అభిజిత్ ముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమం జరగడం విశేషం. రామ్‌లల్లా ఆలయంపై ఏర్పాటు చేసిన కాషాయ ధ్వజం త్రిభుజాకారంలో 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు ఉంది.

జెండాపై ఆధ్యాత్మిక ధ్వనికి ప్రతీకగా 'ఓం' అక్షరాన్ని రాముడి సూర్యవంశ వంశానికి సూచికగా "సూర్యుడు, కశ్యప మహర్షి మందార, పారిజాత మొక్కలను కలిపి సృష్టించిన 'కోవిదార్ చెట్టు' చిహ్నాలను ఉంచారు. వాల్మీకి రామాయణం అయోధ్య కాండలోనూ ఈ జెండా గురించి ప్రస్తావన ఉందని ప్రముఖ సాంస్కృతిక వ్యవహారాల పరిశోధకుడు లలిత్ మిశ్రా గుర్తించారు. ఆ సమాచారం మేరకే ఈ జెండాను రూపొందించారు.

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గల పారాచ్యూట్ తయారీ సంస్థ ఈ జెండాను తయారుచేసింది. సుదీర్ఘకాలం మన్నేలా పారాచ్యూట్ గ్రేడ్ వస్త్రంతో, పట్టుదారాలతో 25 రోజుల పాటు శ్రమించి దీన్ని తీర్చిదిద్దారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యిందనే దానికి సంకేతంగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గతేడాది జనవరి 22న ఈ ఆలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

**500 ఏళ్ల నాటి కల నెరవేరింది: ప్రధాని**

అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ జై శ్రీరామ్ నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. శతాబ్దాల గాయాలు, బాధలు నేడు నయమైనట్లు, 500 ఏళ్ల నాటి కల నెరవేరినట్లు తెలిపారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు.

ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని.. భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోడీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్రం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని అప్పటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మోడీ ఆకాంక్షించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు.

చిన్నారులు, మహిళలు ఆయనకు స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. రోడ్‌షో తర్వాత రామజన్మభూమి ఆలయంలో శేషావతార్ మందిరంలో మోడీ ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం కొత్తగా నిర్మించిన సప్త మందిర్‌ను మోడీ సందర్శించారు. ఇందులో మహర్షులైన వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, అహల్య, నిషాదరాజ్ గుహ, మాతా శబరి విగ్రహాలు, ఆలయాలు ఉన్నాయి. దీంతోపాటు మాతా అన్నపూర్ణాదేవికి కూడా పూజలు చేశారు. ఆ తర్వాత ప్రధాని మోడీ గర్భగుడిలో బాలరాముడికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అది జరిగాక గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని మోడీ ఎగురవేశారు.

**ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభం: యుపి సిఎం**

మరోవైపు అయోధ్యలో ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభమని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామభక్తులకు ఇది ఎంతో శుభదినమని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణంతో అయోధ్యకు అనుసంధానం పెరిగిందన్నారు. అయోధ్య బాలరాముడి గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఎగురవేసిన ప్రధాని మోడీకి, ఉత్తర్‌ప్రదేశ్ ప్రజల తరపున యోగి అదిత్యనాథ్ అభినందనలు తెలిపారు.

**శ్రేయస్సును ఇచ్చిన ధ్వజం శిఖరమెక్కింది: ఆర్ఎస్ఎస్ చీఫ్**

భారతీయుల కల నెరవేరిన రోజు అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. రామ మందిరం కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఈ నిర్మాణం కోసం ఎంతో మంది ఆశతో ఎదురుచూశారని, వారి సంకలనసం నేటితో నెరవేరిందన్నారు. ప్రపంచానికి శాంతి, శ్రేయస్సును వ్యాపింపజేసిన రామరాజ్య ధ్వజం ఇప్పుడు శిఖరంపై కూర్చుందని అన్నారు. ధ్వజం అనేది ఒక చిహ్నం అని పేర్కొన్నారు.



గురువారం న్యూఢిల్లీలోని సిక్కుదేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# ఇక 'గ్రేటర్' విస్తరణ

>> ఇప్పుడున్న ఎస్‌పిడిసిఎల్, ఎస్‌డిసిఎల్... రెండు డిస్కమ్లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షి త మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలను కేబినేట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్తు విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదు ఏళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదేళ్ళ కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్ లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమంతట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధిత ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది.. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో.. ముందుగా అంచనాలు వేసుకొని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందులో ఏ సంస్థ తక్కువగా అందిస్తే వారి దాని వద్దే కొనుగోలు చేయాలని కేబినెట్ భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరు లో అండర్ గ్రౌండ్ విద్యుత్తు కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం జిహెచ్‌ఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14 వేల 725 కోట్ల ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించుకొని.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ,ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని. ఇప్పుడున్న 56 ఏటీసీలతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీ లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మోగిన పంచాయతి నగారా

>> ఉన్నారు. అందులో 81లక్షల 42వేల 231 మంది పురుషులు, 85లక్షల 12వేల 455 మంది మహిళలు,ఇతరులు 500 మంది ఉన్నారు. మొదటి దశలో 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు ఎన్నికలను నిర్వహిస్తాం అని రాణి కుముదిని వివరించారు. నవంబర్ 27వ తేదీ నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నట్లుగా ఎన్నికల కమిషన్ తెలిపింది. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనుండగా మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ ను నిర్వహించనున్నట్లుగా ఎస్ఈసీ తెలిపింది.

**మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు**

12,728 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు1,12,242 వార్డు స్థానాలకు ఎన్నికలు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్‌పోలింగ్ రోజే మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు 27 నుంచి తొలి విడత నామినేషన్ల స్వీకరణ. తొలి విడతలో 4,236 సర్పంచ్ స్థానాలకు,37,440 వార్డులకు రెండో విడత ఎన్నికలకు ఈనెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు 38,350 వార్డులకు పోలింగ్. మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు, 36,452 వార్డులకు ఎన్నికలు.

## 'తెలంగాణ రైజింగ్'కు తుదిమెరుగులు

>> వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మొహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. 28న విద్య, యువజన సంక్షేమం: సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులు,అదే రోజు సాయంత్రం 6 గంటలకు: టూరిజం, టెంపుల్ టూరిజం: మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ సంబంధిత అధికారులు పాల్గొంటారు. 29న వ్యవసాయం, సంక్షేమ విభాగాలు-సాయంత్రం 4 గంటలకు: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులు పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు: మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క , మొహమ్మద్ అజరుద్దీన్ పాల్గొంటారు. 30న - ఆరోగ్య రంగం: సీఎంతో పాటు మంత్రి దామోదర్ రాజనరసింహ సంబంధిత అధికారులు పాల్గొంటారు.

## సమాచారం లీక్

>> తీసుకుంటామన్నారు. కాగా, కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు, చర్చల సారాంశం మొత్తం బిఆర్ఎస్ లీడర్లకు వెంటనే చేరుతున్నట్టు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈ మధ్య జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్ పరిధిలో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించాలని నిర్ణయించారు. అందుకోసం పరిశ్రమల శాఖ రూపొందించిన హిల్టప్(హెచ్ఐఎల్‌టిపి) పాలసీని అమోదించారు.

అయితే ఈ పాలసీకి సంబంధించిన వీధివిధానాలు తయారు చేసి ఆ శాఖ సెక్రెటరీ ఆమోదించిన తర్వాత జీవో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ లోపే కొందరు ఆఫీసర్లు డిటెయిల్స్ అన్నీ బిఆర్ఎస్ నేతలకు చేరవేసినట్టు ప్రచారం జరుగుతున్నది. వాటిని ఆధారంగా చేసుకుని సర్కారుపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇండస్ట్రీ భూముల బదిలీ పేరుతో రూ.లక్షల కోట్ల స్కామ్‌కు కాంగ్రెస్ పాలకులు తెరలేపారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు పై వ్యాఖ్యలు చేశారు.


వార్త

నిన్ను నీవు మోసగించుకున్నంతగా ఇంకొకరెవరూ నిన్ను మోసగించరు.

-గోథె

# 'సర్' ప్రకంపనలు

'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ వంటి మీద జెర్రిలు పాకుతున్నాయి. నిన్నగాక మొన్న ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిల పడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడుతున్నాయి. బ్యాలెట్ బాక్స్‌లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్నికల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పించేవారు. వారు వీరుగా, వీరు వారుగా అధికార విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. బీహార్‌లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ పార్టీ విపరీతంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్‌లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో 'ఓట్ చోరీ' ర్యాలీకి సిద్ధమవుతున్నాయి. డిసెంబరు 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూభావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. కర్ణాటక నుంచే బిజెపి 'ఓట్ చోరీ'కి మద్దతు ఇస్తోందని, తాజాగా బీహార్ ఎన్నికల ఫలితాలు 'ఓట్ చోరీ' ప్రభావమేనని కాంగ్రెస్ తమ పార్టీ శ్రేణుల్లో నమ్మకం కలిగించింది. కర్ణాటక కాంగ్రెస్ 1.12కోట్ల సంతకాలు సేకరించగా పంజాబ్,కాంగ్రెస్ యూనిట్ 27 లక్షల సంతకాలను సేకరించి పార్టీకి సమర్పించింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్‌పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. బీహార్‌లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్‌ఓలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్‌ఐఆర్ ప్రక్రియ బిఎల్‌ఓల పాలిట మృత్యుపాశంలా తయారయ్యిందని కాంగ్రెస్ జాతీయ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఇసి నిర్ణయాలపై ఆరోపించారు. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమబెంగాల్‌లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్‌లో ఉండేవారి పత్రాలను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీలించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్‌తో బెంగాల్ పోలీసులు సతమతమవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్‌లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడలాంటి ఎన్నీ బయ టపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున ఎంతోమంది బంగ్లాదేశీయులు ఇక్కట్ల పాలవుతున్నారు. తాత్కాలికంగా నైనా ఆ వారికి భద్రత కల్పించడం పోలీసులకు అంతే తేలికైన పనిలా లేదు. ఎస్‌ఐఆర్ కారణంగా అసాధారణ వలస దారులను పట్టుకోవడం సాధ్యమౌతోంది.


జీవితంలో స్వయంగా పైకి వెళ్లినవాడు వినమ్రంగా ఉంటాడు. అణుకువగా జీవించేవాడే పైకి వెళ్లగలడు.

షేక్‌స్పియర్


జీవితం ఒక తరంపాటే ఉంటుంది. మంచిపేరు చిరకాలం ఉంటుంది.

ఎమర్సన్

# చట్టం ముందు అందరు సమానులే

**జాతీయ న్యాయ దినోత్సవం, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో అవగాహనను పెంపొందించే వేదికగా మారింది. చట్టం ముందు అందరూ సమానము అన్న రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం సార్థకంగా ఆచరించేటపుడు ఈ దినం నిజమైన ఉద్దేశ్యం నెరవేరుతుంది. ప్రజలకు న్యాయం చేరేటట్లు, న్యాయ సహాయం అందుబాటులో ఉండేటట్లు వ్యవస్థ కృషి చేస్తూనే ఉండాలి. జాతీయ న్యాయ దినోత్స వం మన దేశంలో చట్టపరమైన చైతన్యాన్ని పెంపొందిం చేందుకు ఒక విలువైన సందర్భం. న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి, చట్టంముందు సమానత్వం అమ లులో ఉండాలి, న్యాయస్ఫూర్తి సామాజిక జీవనంలో ప్రతి ఫలించాలి ఇవి ఈదినం ఇచ్చే ప్రధాన సందేశాలు. రాజ్యాంగ విలువలను మనం మన జీవనంలో ఆచరిస్తూ, న్యాయా నికి గౌరవం చూపుతూ సమాజంలో న్యాయం మరియు సమానత్వం పెంపొందించే ప్రయత్నం కొనసాగిం చినప్పుడే ఈ దినోత్సవం నిజమైన అర్థాన్ని పొందుతుంది.**

సొప్పరి నరేందర్

మన భారతదేశంలో న్యాయవ్యవస్థ రాజ్యాంగ వ్యవస్థ ఎంతో ముఖ్యమైనవి. ఈ వ్యవస్థలు భారతీయ ప్రజలకు అవగాహన పెరిగే అవకాశాన్ని ఇస్తుంది. సమాజంలో హక్కులు, బాధ్యతలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఈ రోజు విద్యార్థులు, యువత, సామాన్యులు, చట్టం, న్యాయం, సమానత్వం రాజ్యాంగ విలువలపై ప్రయోగాత్మకంగా ఆలోచించాలి. న్యాయవాదులు, న్యాయసంస్థలు ఈ రోజును వినియోగించి చట్టం ముందు అందరూ సమానత్వం అనే సందేశాన్ని వినిపించాలి. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయం జరగకూడదన్న సూత్రమే న్యాయవ్యవస్థకు పునాది. రాజ్యాంగం అనేది కేవలం న్యాయవాదుల పత్రం కాదు ఇది జీవితానికి వాహనం,దాని స్ఫూర్తి ఎల్లప్పుడూ యుగ స్ఫూర్తి. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థంగా నవంబర్ 26 న భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం ఇది 1949 లో కొత్త శకానికి నాంది పలికిన చారిత్రాత్మక సంఘటన. 76వ వార్షికోత్సవాన్ని సూచించడం జరుగుతుంది. ఈ రోజును జాతీయ న్యాయ దినోత్సవం లేదా జాతీయ రాజ్యాంగ దినోత్సవం అని కూడా పిలుస్తారు, దీనిని భారత రాజ్యాంగం గురించి అవగాహన పెంచడానికి కూడా జరుపుకుంటారు. రాజ్యాంగ నిర్మాతల సహకారాన్ని గుర్తించి గౌరవించడానికి రాజ్యాంగం కల్పించే ప్రముఖ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించింది. 1949లో ఈ రోజున భారత రాజ్యాంగంఆమోదించబడింది ఇది జనవరి 26, 1950న అమలులోకి వచ్చింది. భారత దేశంలో న్యాయ వ్యవస్థ ముందు పెండింగ్ కేసుల సంఖ్య ఇంకా భారీగా ఉంది. ప్రజలలో చట్టపరమైన అవగాహన ఇంకా పూర్తిగా లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమాలు సరిగా జరగకపోవడం ఒక విషయం. న్యాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి వినియోగంపై కూడా దృష్టి అవసరం పెట్టాలి. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగసభ భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించింది. ఇది జనవరి 26, 1950న అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ దినోత్సవం రాజ్యాంగం,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగాపెట్టుకుంది. ముసాయిదా కమిటీ ఛైర్మన్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్‌ను భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పిగా పరిగణిస్తారు. ఆయనను భారతరాజ్యాంగ పితామహుడు అని కూడా పిలుస్తారు. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ సభ్యులు రూపొందించారు. రాజ్యాంగం అనేది భారత ప్రభుత్వం లిఖిత సూత్రాలు. ఇది ప్రభుత్వం దేశ పౌరుల ప్రాథమికరాజకీయ సూత్రాలు, విధానాలు, హక్కులు, నిర్దేశక సూత్రాలు, పరిమితులు విధులను రూపొందిస్తుంది. భారత రాజ్యాంగం దేశాన్ని సార్వభౌమ, లౌకిక, సోషలిస్ట్ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తుంది. ఇది దాని పౌరుల సమానత్వం, స్వేచ్ఛ న్యాయాన్ని నిర్ధారిస్తుంది.ప్రవేశిక అనేది భారత ప్రజల లక్ష్యాలు ఆకాంక్షలను నమోదు చేసే ఒక సంక్షిప్త ప్రకటన. భారత రాజ్యాంగం ఇలా చెబుతోంది భారతదేశ ప్రజలమైన మేము, భారతదేశాన్ని సార్వభౌమ,



లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలని,దాన్ని పౌరులందరికీ న్యాయం, సామాజిక, ఆర్థిక రాజకీయ స్వేచ్ఛ, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం,ఆరాధన స్వేచ్ఛ, హోదా, అవకాశాల సమానత్వం, వారందరిలో సోదరభావాన్ని పెంపొందించడం, వ్యక్తి గౌరవాన్ని దేశం ఐక్యత సమగ్రతను నిర్ధారించడం. 1949 నవంబర్ ఇరవై ఆరవ రోజున మన రాజ్యాంగ సభలో ఈ రాజ్యాంగాన్ని ఇందుమూలంగా స్వీకరించి, అమలు చేసి మాకు మేము ఇచ్చుకుంటున్నాము. రాజ్యాంగాన్ని అనేక వనరుల నుండి తీసుకోబ డింది,అయితే భారతదేశ అవసరాలు పరిస్థితులకు అత్యం త ప్రాముఖ్యత ఇవ్వబడింది. బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించే ముందు 60కి పైగా దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేశారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా అంబేద్కర్ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి మంత్రిత్వ శాఖలు విభాగాలు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. నవంబర్ 25, 1949న రాజ్యాంగ సభ తన కార్యకలాపాలను ముగించే ముందు అంబేద్కర్ ఒక హృదయ స్పర్శి ప్రసంగం చేశారు. ఇది భవిష్యత్తు కోసం మూడు హెచ్చరికలతో ముగిసింది.మొదటిది ప్రజాస్వామ్యంలో ప్రజా నిరసన స్థానం గురించి. పౌర అవిధేయత, సహాయ నిరాకరణ, సత్యాగ్రహ పద్ధతులను వదిలివేయాలి అని ఆయన అన్నారు, రెండవ హెచ్చరిక ఆలోచన లేకుండా సమర్పించడం గురించి చర్చించింది. ఆకర్షణీయమైన అధికారం, మతంలో భక్తి అనేది ఆత్మ మోక్షానికి మార్గం కావచ్చు, కానీ రాజకీయాల్లో భక్తి లేదా హీరో ఆరాధన అనేది అధోకరణానికిచివరికి నియంతృత్వానికి ఖచ్చితంగా మార్గం అని అంబేద్కర్ అన్నారు. భారతీయ సమాజంలో అసమానత సోపానక్రమం ఇప్పటికీ పాతుకుపోయినందున భారతీయులు రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతృప్తి చెందకూడదని ఆయన చివరి హెచ్చరిక. మనం దానిని ఎక్కువ కాలం నిరాకరిస్తూనే ఉంటే మన రాజకీయప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తాము. భారత రాజ్యాంగం ఇప్పుడు ప్రతి భారతీయుడికి అర్థమయ్యేలా ఉంది, వారు ఏ భాష లేదా మాండలికం మాట్లాడినా. విదేశాంగ మంత్రిత్వ శాఖ అన్ని విదేశీ భారతీయ పాఠశాలలను నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని ఆదేశించింది.రాజ్యాంగాన్ని ఆ దేశ స్థానిక భాషలోకి అనువదించి వివిధ అకాడమీలు, గ్రంథాలయాలు, ఇండాలజీ ఫ్యాకల్టీలకు పంపిణీ చేయాలని రాయబార కార్యాలయాలను ఆదేశించింది. వాస్తవానికి, అధికారికంగా భారతదేశంలో 22 కంటే ఎక్కువ భాషలుమాట్లాడబడుతున్నాయి. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా వాస్తవానికి రాజ్యాంగంలో తన పౌరుల హక్కులను వివరించింది, దానిని ఎల్లప్పుడూ తదనుగుణంగా పాటించాలి. అందువల్ల ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకోవాలి. భారత రాజ్యాంగ ఆవిష్కరణ వార్షికోత్సవంగా ఆవిర్భవించిన జాతీయ న్యాయ దినోత్సవం, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో అవగాహనను పెంపొందించే వేదికగా మారింది. చట్టం ముందు అందరూ సమానము అన్న రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం సార్థకంగా ఆచరించేటపుడు ఈ దినం నిజమైన ఉద్దేశ్యం నెరవేరుతుంది. ప్రజలకు న్యాయం చేరేటట్లు, న్యాయ సహాయం అందుబాటులో ఉండేటట్లు వ్యవస్థ కృషి చేస్తూనే ఉండాలి. జాతీయ న్యాయ దినోత్సవం మన దేశంలో చట్టపరమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ఒక విలువైన సందర్భం. న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి, చట్టంముందు సమానత్వం అమలులో ఉండాలి, న్యాయస్ఫూర్తి సామాజిక జీవనంలో ప్రతి ఫలించాలి ఇవి ఈదినం ఇచ్చే ప్రధాన సందేశాలు. రాజ్యాంగ విలువలను మనం మన జీవనంలో ఆచరిస్తూ, న్యాయానికి గౌరవం చూపుతూ సమాజంలో న్యాయం మరియు సమానత్వం పెంపొందించే ప్రయత్నం కొనసాగించినప్పుడే ఈ దినోత్సవం నిజమైన అర్థాన్ని పొందుతుంది. •

# ఎఐ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు

సయ్యద్ నిసార్ అహ్మద్


సుస్థిర, శాశ్వత ఉపాధి రంగాలలో పెట్టుబడులు పెరిగితేనే భారత్ లాంటి దేశాలకు ప్రయోజనకరం. కానీ నేడు అందుకు విరుద్ధమైన రీతిలో మనదేశంలో పెట్టుబడుల తీరు సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకీ ఏఐ ప్రభావం విపరీతంగా పెరుగుతోంది. మరోవైపు ఏఐ వల్ల చాలా మంది నిరుద్యోగులవుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆసక్తికర నివేదిక వెల్లడైంది. భారతదేశంలో దాదాపు సంగం అంటే 47శాతం కంపెనీలు బహుళ జనరేటివ్ ఏఐని ఉత్పత్తిలో వినియోగిస్తున్నట్లు ఈవైసీఐఐ సంయుక్తంగా రూపొందించిన నివేదిక వెల్లడించింది.'ది ఏఐడియా ఆఫ్ ఇండియా' అవుట్ లుక్ 2026' పేరుతో ఈ నివేదికను రూపొందించారు. దీనికోసం 200 భారతీయ సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.ఈ క్రమంలో 95శాతం కంటే ఎక్కువసంస్థలు మొత్తం ఐటీ వ్యయంలో 20 శాతం కంటే తక్కువగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) బడ్జెట్‌లను నిర్వహిస్తున్నాయి. ఇక్కడితో ఆగని ఎంతోమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తున్నట్లు తేలింది. ఆ రంగంలోకి పెట్టుబడుల వరద సాగిస్తున్నారు. అయితే ఇదెంత వరకు సేఫ్? మన దేశంలో ఈ పరిణామం ఎంత వరకు మేలు చేస్తుందన్నది. ఇప్పుడు చర్చగా మారుతోంది. మన దేశానికి మనవ వనరు భారీ స్థాయిలో ఉంది.అంటే మన దేశంలో యువత సంఖ్య అధికంగా ఉంది. ఇది ఏ దేశానికైనా పురోగతి కోసం ఉపయోగపడుతుంది. కానీ ఈ యువతకు పూర్తి స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరికినప్పుడే. ఇప్పటికే మన దేశంలో చాలా మంది యువతకు ఉపాధి అవకాశాలు పూర్తి స్థాయిలో లేవు. ఈ క్రమంలో ఉపాధి అవకాశాలు పెంచే దిశగా పరిశ్రమల ఏర్పాటు, కార్పొరేట్ కంపెనీ స్థాపన, ఇలాంటి రంగాల్లో పెట్టుబడులు పెరగాలి.కానీ తాజాగా తేలిన అధ్యయనంలో ఆందోళనకరమైన వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగల కల్పన కంటే సాంకేతికత కారణంగా ఉద్యోగాలు ఊడిపోతున్న సంఖ్యయే అధికంగా ఉంది. ఈ తరుణంలో పెట్టుబడులు ఉపాధి కల్పన రంగాల్లో జరగాల్సి ందిపోయి ఏఐ రంగంలోకి మళ్లడం మన భారత్ లాంటి దేశాలలో ఓ శాపమే. ఏఐ రంగంలో పెట్టుబడులపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏఐ రంగంలో పెట్టుబడులు పెడితే ఆశించినంత రాబడులు రాని పక్షంలో ఆశలు రేకెత్తిస్తున్న ఈ బుడగ బద్ధలయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఏఐ రంగంలో పెట్టుబడులు ఏ మాత్రం శ్రేయస్కరం కాదన ఏఐ అనేఆశల బుడగ బద్ధలయ్యే రోజు దగ్గర్లోనే ఉందని పలువురువ్యాఖ్యానిస్తున్నారు. అదే జరిగితే డాట్‌కామ్ సంక్షోభం నాటి రోజులు మళ్లీ వస్తాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.ఏఐ రంగం వైపు పెట్టుబడులు పెరగడానికి కారణాలు కూడా ఉన్నాయి. ఇతర రంగాలలో పెట్టుబడులు పెట్టాలంటే ప్రస్తుతంకంపెనీ మార్కెట్ విలువ అమాంతం పెరిగిపోవటం. అసాధారణంగా పెరిగిన అంచనాల నేపథ్యంలో నిధుల సేకరణ జరగటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ కారణం చేతనే ప్రస్తుతం ఏఐరంగంలో భారీగా పెట్టుబడులు వచ్చి పడుతున్నాయి. అయితే ఇదెంతో కాలం సాగదని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ఏమైనా ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టే వారంతా ఆచితూచి అడుగులు వేయటం మంచిదని ఆర్థిక నిపుణుల మాట. ఈపరిస్థితుల నేపథ్యంలో మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిది, మన దేశంలో ఉపాధి అవాశాలు పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. పెట్టుబడిదారులను ఏ వైపు ప్రోత్సహించాలి, ఏ రకమైన ప్రోత్సాహకాలు అందించి మన దేశంలో ఉపాధి కల్పన రంగాలలో పెట్టుబడులను ప్రోత్సహించాలి అన్నది ప్రభుత్వం వైపు నుంచి కూడా ఆలోచన చేయాలి. దేశంలోని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పన బాధ్యత ప్రభుత్వానిదే. •

# శ్రామిక చట్టాలకు నూతన శకం



వాసం శెట్టి సుభాష్

భారతదేశంలో శ్రామిక చట్టాలకు కొత్త శకం ఆరంభమైంది. కేవలం చారిత్రక సంస్కరణ మాత్రమే కాదు, దేశంలోని ప్రతి శ్రామికుడికి గౌరవాన్ని, భద్రతను కల్పించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. కేంద్రప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపనున్నాయి. దశాబ్దాలుగా అమలులో ఉన్న కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడంవల్ల దేశ వ్యాప్తంగా కార్మికులు హర్షాతీరేకాలు వ్యక్తం చేస్తున్నారు.నూతన కార్మిక చట్టాలు దేశాభివృద్ధికి బాటలు వేసే సంస్కరణలు. దేశంలోని కార్మిక చట్టాల చరిత్రలో ఇది ఒక గొప్ప సంస్కరణగా నిలుస్తుంది. సరళత, పారదర్శకత, సమర్థత, కార్మికుల సంక్షేమానికి నాలుగు నూతన కార్మిక చట్టాలు దోహదపడతాయి.నూతన చట్టాల వల్ల కీలక మార్పులతో అందరికీ సాంఘీక భద్రత, అసంఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫార్మ్ వర్కర్లవంటి వర్గాలకు కూడా రక్షణ పొందే అవకాశం లభించింది.నూతన కార్మిక చట్టాలతో పరిశ్రమలకు సరళీకృత విధానాలు, పెట్టుబడులు, ఉత్పత్తి, ఉద్యోగావకాశాలు పెరిగేలా వ్యవస్థను రూపొందించారు. అంతేకాకుండా వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, తదితర అంశాలు ఈ చట్టాలతో మెరుగైన పద్ధతిలో అమలు చేయడానికి అవకాశం ఉంటుంది.ఈ చట్టాలు కాగితాలపైనే కాకుండా కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయి. ఇప్పటివరకు ఉన్న 29పాత కార్మిక చట్టాలను సరళతరం చేస్తూ, దేశంలోని 40కోట్ల మందికి పైగా కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలకు హామీ లభిస్తున్నది. దేశంలోని 40 కోట్ల మంది, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటితక రంగాల్లోని లక్షలాది మంది కార్మికులకు కనీసవేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలను లభించనున్నాయి. తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా అన్ని చోట్లా దేశవ్యాప్తంగా ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతోపాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చు. మనదేశంలో 1930–50 మధ్య రూపొందించిన కార్మిక చట్టాలే నేటికి అమలులోఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో ప్రస్తుత తరానికి ఆ చట్టాలు సరిపోవనే ఆందోళనలు ఉన్న సంగతి విదితమే.దశాబ్దాల నాటి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన చట్టాలను అమలు చేయడం వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాలు, ఫ్యాక్టరీలకు కష్టంగా మారింది. అలాగే కార్మికులకు సరైన భద్రత, సంక్షేమం




అందడం లేదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఈ సమస్యలను అధిగమించేందుకు నూతన కార్మిక కోడ్‌లను కేంద్రం రూపొందించడం ద్వారా కార్మికులకు ఎంతో మేలు చేసింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రతా కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, వృత్తి భద్రత,ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రతా కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి అన్ని రంగాలకూ వర్తించనున్నాయని...కార్మికుల భద్రత మెరుగుపర్చడానికి, అలసటను తగ్గించడానికే కాక భద్రత, అదనపు ప్రయోజనాలు లభిస్తాయని చెబుతున్నారు. దీంతో ఇప్పటి వరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను హేతుబద్ధం చేసినట్లు అవుతుందని కేంద్ర ప్రభుతం చెబుతోంది. దీని ద్వారా మెరుగైన కార్మిక, ఉద్యోగ విధానాలు అమలల్లోకి రానున్నాయి. కొత్త కార్మిక నియమావళి ప్రకారం అతిపెద్ద మార్పులలో ఒకటి రోజువారీ పని పరిస్థితులు, ఉద్యోగులు ఎంత కాలం పని చేస్తారు, వారు ఎప్పుడు వేతనంతో కూడిన సెలవులకు అర్హులు, వారు ఎంత ఓవర్ టైం తీసుకోవచ్చు, వారు ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలకు అర్హులు లాంటివి నిర్ణయిస్తుంది. ఇప్పటివరకు, ఉద్యోగులు వార్షిక వేతనంతో కూడిన సెలవుకు అర్హత సాధించడానికి ముందు ఒక క్యాలెండర్ సంవత్సరంలో 240పని దినాలను పూర్తి చేయాల్సి ఉండేది. కొత్త కోడ్‌లు ఆ అవసరాన్ని 180రోజులకు తగ్గించాయి. అంటే ఇప్పుడు ఒక కార్మికుడు ఏడాదిలో చాలా ముందుగానే సెలవుకు అర్హుడు అవుతాడు. ఇది తయారీ, వస్త్రాలు, రిటైల్, నిర్మాణం,హాజరు నియమాలు సాంప్రదాయకంగా కఠినంగా ఉండే ఇతర రంగాలలోని వారికి పెద్ద మార్పు అని చెప్పవచ్చు. కొత్త కోడ్‌ల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు, వారానికి 48 గంట లు పనిచేయాలనే నియమం అలానే ఉంటుంది. కానీవాటిని ఎలా ఏర్పాటు చేసేకోవచ్చనేది మాత్రం మారుతుంది. దీనిని వారంలో నాలుగు రోజులు 12గంటలు, ఐదు రోజులు వారాంలో దాదాపు 9.5 గంటలు, ఆరు రోజులు వారంలో రోజుకు ఎనిమిది గంటలు కింద విభజించుకోవచ్చును.దీంతో పాటూ ఓవర్‌టైమ్ పరిమితిని స్థానిక అవసరాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమసొంత పరిమితులను నిర్ణయించుకోవచ్చు. కొత్త కోడ్‌లలో మరో ప్రధాన మార్పుఆరోగ్యం, వైద్యకవరేజ్. 40 ఏళ్ల పైబడిన ప్రతి ఉద్యోగికి ఇప్పుడు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీ లభిస్తుంది. ముఖ్యంగా ఎక్కువ గంటలు, ప్రమాదకర వాతావరణాలు లేదా శారీరకఒత్తిడి సాధారణంగా ఉండేరంగాలలో, నివారణ ఆరోగ్య సంరక్షణ వైపు విస్తృత ప్రయత్నంలో ఇది భాగంగా ఉంటుంది. ముఖ్యంగా, తోటల కార్మికులకు ఇప్పుడు గతంలో ఒకేవిధంగా అందుబాటులో లేని వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ నిబంధన కార్మికులకు అనుకూలంగా ఎన్డీయే ప్రభుత్వం ఈ కోడ్‌లను రూపొందించింది.ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయి. యువతకు నియామక పత్రాలు అందుతాయి, మహిళలకు సమాన వేతనాలు, గౌరవం లభిస్తుంది.40కోట్లమంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది, ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయి.2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతం. •

(రచయిత : కార్మికశాఖ మంత్రి)

# ప్రజావాక్కు



### పాత చట్టాల విలీనం

**భారత** దేశంలో భూమి, కార్మిక విధానాల సంస్కరణలు ఎన్నో దశాబ్దాలుగా చర్చలో ఉన్నా, అమలులో మాత్రం నెమ్మదిగా ముందుకువచ్చాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 29 పాత చట్టాలను విలీనం చేస్తూ నాలుగు కొత్త కార్మిక నియంత్రణ వ్యవస్థలను అమలు చేయాలని ప్రకటించడం ఈదిశలో ఒక ముఖ్యమైన అడుగు.ఇవి నియమాల క్లిష్టత తగ్గించి,కార్మికుల భద్రతను విస్తరించి,సంస్థలకు స్పష్టమైన, ఆధునిక విధానాలను అందించడమే లక్ష్యం. ఒక్క సంస్థ నడిపేందుకు వేలకొద్దీ నియమాలను అనుసరించాల్సి రావడంవల్ల వ్యాపారాలకు భారీఖర్చులు, ఆలస్యం, అపనమ్మకం ఏర్పడింది. తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులతోసమానహక్కులు ఇవ్వడంవంటి నూతనచర్యలు ఉద్యోగ వాతావరణాన్ని సమానంగా మార్చగలవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రయత్నం తప్పనిసరి

**మనదేశంలో** అభ్యర్థులు ఉన్నత విద్యాభ్యాసం తరువాత ఉద్యోగ ప్రయత్నాలకు వారిసమర్థత, అభిలాష బట్టి దేశ వ్యాప్తంగా ప్రయత్నాలు సులువుగా చేయొచ్చు. ఒక నిర్దేశ వ్యవధి దాటినాక ప్రయత్నం తప్పనిసరి. మరి ఏదైనా, కేవలంఇతరదేశంలోని ఉద్యోగమేవిలువ,గౌరవం, డబ్బుకు ప్రజలు గుర్తిస్తారనుకోవడం సరికాదు. అది మన భవిష్యత్తు, జీవనం,తృప్తికోసమని గుర్తించాలి.మనో భావాలు మన సొంతం.ఆత్మగౌరవం, పనిలోతృప్తి ఉంటేనే సంపాదనకు పరమార్థం.ఈ ప్రాథమిక భావన విస్మరించి విదేశీ విద్యాలయంలో కాలు పెట్టేందుకే కోట్ల ధనం అప్పులు చేసి చివరికి అనుమతి రాలేదని నిండు జీవితం అంతం చేసుకోవడం వ్యక్తిగతమైనప్పటికీ అభిలషణీయం కాదు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### ప్రత్యేక రైళ్లు నడపాలి

**ప్రకాశం** జిల్లాలోని కంభంఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి కాలేదు. కంభంలో చాలా వీధులలో సిసి రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉంటుంది. ఆసియాఖండంలోనే ప్రసిద్ధి గాంచిన చెరువు ఈ గ్రామంలో ఉంది. ఈ చెరువును సైతం పర్యాటక ప్రదేశంగా పూర్తిస్థాయి హంగులతో తీర్చిదిద్దాలి. ఈ ఊరి మీదుగా ఎక్కువగా రైళ్లు నడుపుటకు దక్షిణ మధ్య రైల్వేవారు చర్యలుతీసుకోవాలి. ప్రత్యేక రైళ్లను నడపాలి.

- సాగర్, కంభం

### సాక్ష్యాలు ముఖ్యం

**ఈమధ్య** సుప్రీంకోర్టు సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా హత్యానేరం మోపబడిన వారిని విడుదల చేయడం జరిగింది. మరి ఈ హత్యలు ఎవరు చేసినట్టు? ఏళ్లు గడుస్తున్నా వివేకానందరెడ్డి కేసు తెమలటంలేదు.సాక్షులు కాలక్రమంలో చనిపోవడమో లేక హత్య చేయబడడమో జరుగుతున్నది. తిరుపతి పరకామణిలోకోట్లసొమ్మును దొంగిలించినవారిని బయటపెట్టిన పోలీసు అధికారి రైలులో హత్య చేయబడ్డారు. సాక్ష్యాలు దొరకటం లేదు. కోర్టుకున్న గంతలు తొలగించినా అవి కనలేవు. వాటికి సాక్ష్యాలే కావాలి.అవి దొరకవు. సాక్ష్యాలకు దొరకకుండా పకడ్బందీగా నేరాలు చేయడం నేర్చుకున్నారు. ఈ కారణంగా దొంగలు,హంతకులుహాయిగా, హుందాగా బయట తిరుగుతుంటా రు. అవినీతి ఆరోపణలు చేయబడ్డవారు ఏళ్ల తరబడి బెయిల్ మీద ఉంటారు. వేలకొలది వాయిదాలు ప్రసాదిస్తాయి.

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### ధైర్యానికీ దృఢసంకల్పానికీ నిదర్శనం

**అంధ** మహిళల టీ20 క్రికెట్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడం భారత మహిళా క్రీడా చరిత్రలో ఒక గర్వ కారణమైన ఘట్టంగా నిలిచింది. శారీరక పరిమితులు ఉన్నా కూడా అజేయ సంకల్పంతో, నిరంతర సాధనతో, అపారమైన ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తూ సాధించిన ఈవిజయం సాధారణమైనది కాదు.ఇది కేవలంఒక క్రీడా టైటిల్ గెలుపు మాత్రమే కాదు. అంధుల సామర్థ్యాన్ని ప్రపంచానికి రుజువుచేసిన శక్తివంతమైన సందేశం.అంధ మహిళా క్రీడాకారిణులు ఎదుర్కొనే సవాళ్లుఎన్నో.వారికి ఆటను అర్థం చేసుకోవడం, శబ్ద సంకేతాలను అనుసరించడం, బంతి ధ్వనిని గ్రహించడం వంటి ప్రతి దశలోని కఠినతరమైన సమస్యలను దాటుకుని టీ20 ఫార్మాట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం విశేషం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలి

**ఇప్పటికి** గ్రామాలలో, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వాడుతున్నారు.విద్యావంతులు సైతంప్లాస్టిక్‌కవర్‌లను వినియోగించడం విస్మయానికి గురి చేస్తుంది. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పుఉందని చెబుతున్నప్పటికీ వాటిని వినియోగించకుండా ఉండలేకపోతున్నాం.ప్లాస్టిక్ కవర్ల స్థానంలో బట్ట సంచులు, జూట్ బ్యాగులు వినియోగించడం అలవాటు చేసుకోవాలి. ప్లాస్టిక్‌పైప్రభుత్వ యంత్రాంగం ఉక్కుదపాదం మోపాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



ఖోస్ట్ ప్రావిన్స్‌పై పాక్

# వైమానిక దాడులు

## 9 మంది చిన్నారులు సహా పది మంది మృతి

**కాబూల్, నవంబరు 25:** ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. అర్ధరాత్రి ఆఫ్ఘన్‌లోని ఖోస్ట్ ప్రావి న్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ డ్రోన్ దాడుల్లో నివాస గృహాలు ధ్వంసం కాగా, 9 మంది చిన్నారులు సహా మొత్తం 10 మంది మరణించినట్లు తాలిబన్ ప్రభుత్వం ధ్రువీకరించింది. పలు ఇతర ప్రావిన్స్‌లపైనా ఈ దాడుల ప్రభావం ఉందని పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్ వాణిజ్య మంత్రి అల్హాజ్ నూరుద్దీన్ అజీజ్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉండగా ఈ దాడులు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లోని పెషావర్‌లో నిన్న జరిగిన ఆత్మాహుతి దాడికి ప్రతీకారంగానే ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ప్రభుత్వం చాలా కాలంగా ఆరోపిస్తోంది. గతంలోనూ ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో పాకిస్థాన్ ఇలాంటి దాడులకే పాల్పడింది. అప్పుడు టీటీపీ చీఫ్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు పాక్ ప్రకటించింది. కీలకమైన సందర్భాల్లో పాక్ ఇలా దాడులకు దిగడం ఇరు దేశాల మధ్య వైరాన్ని మరింత పెంచుతోంది. ఇటీవల ఖతార్, తుర్కియేల మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, తాజా దాడులతో ఆ ఒప్పందం నీరుగారిపోయింది. ఈ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఆ సైనికాధికారి తొలగింపు సరైనదే

## - ఆర్మీ నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, నవంబరు 24:** తన రెజిమెంట్‌లోని సైనికులతోపాటు గురుద్వారాలో మతపరమైన ఆచారాలలో పాల్గొనడానికి నిరాకరించిన క్రైస్తవుడైన సైనిక అధికారి శామ్యూల్ కమలేసన్‌పై క్రమశిక్షణ చర్య కింద ఆర్మీ తొలగించింది. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ మంగళవారం సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విస్పష్ట తీర్పునిచ్చింది. అంతేగాక సదరు సైనికాధికారి ఆర్మీకి పనికి రాడు అంటూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అతడిని అసమర్థుడిగా ముద్ర వేసింది. తన తోటి సిక్కు సైనికులు విశ్వాసాన్ని గౌరవించనందుకు అతడిని తొలగిస్తూ ఆర్మీ తీసుకున్న నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. అతను ఎలాంటి సందేశం పంపుతున్నాడు? ఒక ఆర్మీ అధికారి చేసిన తీవ్రమైన క్రమశిక్షణారాహిత్య చర్య. అతడిని తొలగించాలి. ఇలాంటి వ్యక్తులు సైన్యంలో ఉండటానికి అర్హులా? అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అతను అత్యుత్తమ అధికారి కావచ్చు కానీ అతను భారత సైన్యానికి సరిపడడు అని అభిప్రాయపడింది. కమలేసన్ తరపున న్యాయవాది గోపాల్ శంకరనారాయణ వాదించారు. కమలేసన్ హోలీ, దీపావళి వంటి పండగల్లో పాల్గొనడం ద్వారా ఇతర మతాల పట్ల గౌరవాన్ని ప్రదర్శించారని అన్నారు. అతను గురుద్వారా వెలుపల ఉండీ చేయాల్సింది అంతా చేశాడని, కానీ గురుద్వారాలోకి ప్రవేశించడం తన విశ్వాసానికి విరుద్ధమని వారితో చెప్పాడని శంకరనారాయణ కోర్టుకు తెలిపారు. తన ఉన్నతాధికారితోనే కమలేసన్‌కు సమస్య ఉందని చెప్పాడు. అయితే సుప్రీంకోర్టు ఈ వాదనలతో ఏకీభవించలేదు. ఇక కేసు వివరాలను పరిశీలిస్తే, 3వ అశ్వికదళ రెజిమెంట్‌లో గతంలో లెఫ్టినెంట్‌గా ఉన్న శామ్యూల్ కమలేషన్‌ను సైనిక క్రమశిక్షణను ధిక్కరించినందుకు ఆర్మీ తొలగించింది. పూజ నిర్వహించడానికి గురుద్వారాలోకి ప్రవేశించాలని తన ఉన్నతాధికారి ఆదేశాలను పట్టించుకోకుండా తిరస్కరించాడు. ఇది తన క్రైస్తవ ధర్మాన్ని ప్రభావితం చేస్తుందని వాదించాడు. మే నెలలో ఢిల్లీ హైకోర్టు ఈ కేసును విచారించింది. కమలేసన్ తన ఉన్నతాధికారి నుంచి వచ్చిన ఆదేశాల కన్నా మతాన్ని ఎక్కువగా చూస్తున్నారని, ఇది స్పష్టంగా క్రమశిక్షణారాహిత్య చర్య అని తీర్పు చెప్పింది. ఇది సైనిక ధర్మాన్ని ఉల్లంఘించడమే అని చెప్పింది. సుప్రీంకోర్టు కూడా ఇదే తరహా తీర్పును వెల్లడించింది. కమలేసన్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# డిసెంబర్ 1నుంచి పార్లమెంటు

## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

## శీతాకాల సమావేశాలకు సర్వం సిద్ధం



**న్యూఢిల్లీ, నవంబరు 25:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 1 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా చూసేందుకు నవంబరు 30న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ భేటీలో ప్రభుత్వం చర్చకు తీసుకురావాలనుకుంటున్న బిల్లులు, ఇతర ముఖ్యమైన అంశాలపై విపక్షాలకు వివరించి, వారి సహకారం కోరనుంది. ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉంటాయి. పది కీలక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి మోడీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే, ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని సభలో బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సభలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం వంటి అంశాలపై చర్చించేందుకు విపక్షాలు కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద, ఈ సమావేశాలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు ట్రంప్ సీరియస్ షాక్

## విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ముద్ర వేసిన అమెరికా



**వాషింగ్టన్, నవంబరు 25:** అరబ్ ప్రపంచంలో అత్యంత పురాతనమైన, ప్రభావవంతమైన ఇస్లామిక్ ఉద్యమంగా పరిగణించే 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు గట్టి షాక్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సంస్థను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా ముద్ర వేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా అరబ్ ప్రపంచంలో ఈ సంస్థ కార్యకలాపాలపై తీవ్ర ఆంక్షలు పడే అవకాశం ఉంది. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ద్వారా వెల్లడైన వివరాల ప్రకారం ఈ నిర్ణయానికి సంబంధించి విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్లకు ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. లెబనాన్, ఈజిప్ట్, జోర్డాన్ వంటి దేశాలలో ఉన్న ముస్లిం బ్రదర్‌హుడ్ అనుబంధ సంస్థలపై చర్యలు తీసుకునే విధంగా ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ నివేదిక అందిన తర్వాత 45 రోజుల్లోపు ఆ సంస్థలపై ఎలాంటి ముద్ర వేయాలనే అంశంపై మంత్రులు ముందుకు వెళ్లాలని కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులపై ఇప్పటికే ఆయన సంతకాలు చేశారు. ట్రంప్ నిజంగానే ముస్లింలందరినీ ద్వేషిస్తారా బెర్నీ సాండర్స్ కామెంట్ల వెనుక కారణం ఏంటంటే ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవడానికి ట్రంప్ పరిపాలన గట్టి కారణాలను చూపిస్తోంది. ఈ సంస్థ అనుబంధ విభాగాలు ఇజ్రాయెల్, అమెరికా భాగస్వాములపై హింసాత్మక దాడులకు మద్దతు ఇవ్వడం, ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాయని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ముఖ్యంగా ఈ సంస్థ మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తోందని పేర్కొంది.

వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ప్రకారం.."ఈ ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇది పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలు, మిత్ర దేశాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదం, అస్థిరత ప్రచారాలకు ఆజ్యం పోస్తుంది" అని వివరించింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఈజిప్ట్‌తో సహా అనేక అరబ్ ప్రభుత్వాలు స్వాగతించే అవకాశం ఉంది. ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థను 1920లలో ఈజిప్ట్‌లో స్థాపించారు. ఇస్లామిక్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం, ఇస్లామిక్ చట్టాల ఆధారిత పాలనను స్థాపించడం దీని ప్రధాన లక్ష్యం. ఇది అరబ్ దేశాలకు వేగంగా వ్యాపించింది. అలాగే ఈ సంస్థ తరచుగా రహస్యంగా పని చేస్తోంది.

# ఉక్రెయిన్‌లోశాంతిస్థాపనను 19 పాయింట్లకు కుదించిన అజెండా!



**వాషింగ్టన్, నవంబరు 25:** ఉక్రెయిన్‌రష్యా మధ్యజరుగుతున్న యుద్ధాన్ని నివారించి కాల్పుల విరమణ, శాంతిస్థాపనకు అమెరికా నిర్దేశించిన 28 పాయింట్ల అజెండాను ఎట్టకేలకు కుదించారు. ఇది కేవలం రష్యా రూపొందించి ఇచ్చిన పత్రాన్నే ఇచ్చారని అటు ఉక్రెయిన్‌తోపాటు ఐరోపాదేశాలు కూడా తీవ్రస్థాయి విమర్శలుచేయడంతో అమెరికా పునరాలోచనలోప డింది. 28 పాయింట్ల అజెండాను 19 పాయింట్లకు కుదించినట్లు సమాచారం. ఇందుకోసం జెనీవాలో అమెరికా, ఉక్రెయిన్‌ప్రతినిధులు భేటీ అవుతారని అంచనా. వివాదాస్పదమైన అంశాలను సవరించడం లేదా కొంత తీవ్రతను తగ్గించడం వంటి చేసారని అంచనా. అమెరికా అద్యక్షుడు నిజానికి గురువారమే డెడ్‌లైన్ విధించారు. అయితే 28 పాయింట్ల అజెండాను 19 పాయింట్లకు కుదించడంతో వీటిని పునఃపరిశీలన కూడా చేయాల్సి ఉంటుందని ఉక్రెయిన్ అధికారి ఒలెక్జాండర్ బెవ్జ్ అన్నారు. ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ విదేశాంగమంత్రి సెర్గి కిస్లిస్త్యా మాట్లాడుతూ మొదటి అజెండా కంటే కొంతమేర తగ్గినట్లు కనిపించిందని అన్నారు. ఇపుడున్న కొత్త అజెండాలో కూడా ఉన్న వివాదాస్పద అంశాలను అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలు మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తూర్పు ఉక్రెయిన్‌ప్రాంతాన్ని రష్యాకు వదిలివేయడం, మిలిటరీని ప్రస్తుతం ఉన్న 8 లక్షలనుంచి ఆరులక్షలకు కుదించడం, నాటోలోసభ్యత్వం తీసుకోకూడదని ఇలా రష్యా నిబంధనలు ప్రతిపాదించింది. నాటో సైనికస్థావరాలు ఉండకూడదని, నాటో సైనిక, ఆయుధ సాయాలు అందించకూడదన్న షరతులు అన్నీ కూడా రష్యారూపొందించినవేనని అప్పట్లో ఐరోపాకూటమి ఇతర అగ్రరాజ్యాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. ఇపుడు 19 పాయింట్ల కొత్త అజెండాపై అమెరికా, రష్యాల స్పందన ఏమిటన్నది తేలాల్సి ఉంది.

# ఢిల్లీలో ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం!

**న్యూఢిల్లీ, నవంబరు 25:** ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) 300 పైగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందికి హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రతిరోజూ 50 శాతం మంది ఉద్యోగులు మాత్రమే కార్యాలయాలకు రావాలని, మిగిలిన సిబ్బంది ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సంబంధిత ప్రభుత్వ విభాగాల అధిపతులను ఆదేశించింది. ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్) పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సిబ్బంది హాజరును తగ్గించాలని సూచించింది. అత్యవసర సిబ్బంది మినహా మిగిలిన ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని ప్రైవేటు కంపెనీలను ఆదేశించింది. ఎన్విరాన్ మెంట్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1986 లోని సెక్షన్ 5 ప్రకారం పర్యావరణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో రోజురోజుకూ వాయు కాలుష్యం పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. శీతాకాలం కావడం, ముంచు దట్టంగా కురుస్తుండటంతోప్రజలకు శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

గ్రాప్-3 స్టేజి కార్యాచరణలు అమలుచేయాలని నిర్ణయించినప్పటికీ రోజు రోజుకూ పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతోంది. అందుకోసమే ఉద్యోగులకు కొంత మినహాయింపునిస్తూ వర్క్‌ఫ్రంహోమ్ వెసులుబాటు కల్పించింది.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై మరోసారి దాడి!

## ప్రాణహానిలేదన్న పాకిస్థాన్ పోలీస్




**క్వెట్టా, (పాకిస్తాన్), నవంబరు 25:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు మరోసారి దాడికి గురైంది. క్వెట్టా, సిబి మధ్య గత నెలన్నర రోజుల్లో ఈ ప్రయాణికుల రైలుపై దాడి జరగడం ఇది ఆరోసారిగా అధికారులు చెపుతున్నారు. ఈ వరుస దాడులతో ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని బోలన్ పాస్ సమీపంలోని ఆబ్‌ఇగమ్ వద్ద సాయుధులు కాల్పులకు తెగబడ్డారు. రైలులో ఉన్న రైల్వే పోలీస్, ఇతర భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరిపారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు. గతంలోనూ ఇదే రైలుపై అనేకసార్లు దాడులు జరిగాయి. అక్టోబర్ 7న సింధ్ ప్రావిన్స్‌లో జరిగిన బాంబు పేలుడులో ఏడుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో జరిగిన మరో పేలుడులో 12 మంది గాయపడగా, రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ)కి చెందిన ఉగ్రవాదులు ఇదే రైలును హైజాక్ చేసి, 400 మందికి పైగా ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. 24 గంటల తర్వాత ఈ హైడ్రామా ముగియగా, 20 మంది భద్రతా సిబ్బందిని చంపినట్లు ఉగ్రవాద సంస్థ ప్రకటించింది.

# 'బూడిద మేఘాల' ఎఫెక్ట్

## పలు విమాన సర్వీసులు రద్దు


## 12 వేల యేళ్ల తర్వాత పేలిన అగ్నిపర్వతం



**అడ్డిస్‌అబాబా, నవంబరు 25:** 12వేల ఏళ్ల తర్వాత తొలిసారిగా ఇథియోపియాలో అగ్నిపర్వతం బద్దలవ్వడంతో వెలువడిన బూడిద మేఘాలు ఉత్తర భారతంపైకి విస్తరించాయి. ఈ పరిణామంతో దేశంలో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు అప్రమత్తంగా ఉండాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఇథియోపియాలోని హేలీ గుబ్బి అగ్నిపర్వతం దాదాపు 12,000 ఏళ్ల తర్వాతత ఆదివారం బద్దలైంది. దీని నుంచి వెలువడిన దట్టమైన బూడిద మేఘాలు ఎర్ర సముద్రం మీదుగా యెమెన్, ఒమన్ వైపు ప్రయాణించి, ప్రస్తుతం ఉత్తర అరేబియా సముద్రం మీదుగా భారత్‌లోకి ప్రవేశించాయి. ఈ బూడిద మేఘాలు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, ఈ మేఘాలు వాతావరణంలో చాలా ఎత్తులో ఉండటంతో ఢిల్లీ గాలి నాణ్యతపై ప్రభావం చూపే అవకాశాలు తక్కువని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఆకాశ ఎయిర్, ఇండిగో, కేఎల్ఎం వంటి విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేశాయి. నిన్న, ఈరోజు జెడ్డా, కువైట్, అబుదాబికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేసినట్లు ఆకాశ ఎయిర్ ప్రకటించింది. కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ కూడా ఆమ్‌స్టర్‌డామ్‌ఢిల్లీ రాకపోకల సర్వీసులను నిలిపివేసింది.

# సంక్షిప్తంగా..

## గ్రహాంతరవాసుల ఉనికి గుర్తింపుకోసం భారీ టెలిస్కోప్



**టోక్యో, నవంబరు 25:** గ్రహాంతర వాసుల ఉనికిని గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో జపాన్ తాజాగా సరికొత్త టెలిస్కోప్ నిర్మాణం తలపెట్టింది. థర్టీ మీటర్ టెలిస్కోప్ (టీఎంటీ) పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భారత దేశానికీ భాగస్వామ్యం ఉంది. ప్రపంచంలోనే అత్యంత భారీ టెలిస్కోప్ ల సరసన చోటు సంపాదించుకునేలా నిర్మించాలని ప్రయత్నిస్తోంది. ఈ టెలిస్కోప్ తో గ్రహాంతరవాసులు ఉన్నారా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు ఇరు దేశాలు పరిశోధనలు ప్రారంభించాయి. 40 ఏళ్ల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్ జపాన్ ఖగోళ శాస్త్రవేత్తలు 40 సంవత్సరాల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్ పంపించారు. వాటికి ప్రతిస్పందనను గుర్తించేందుకు తాజాగా ఈ టెలిస్కోప్ తో ప్రయత్నిస్తున్నారు. జపాన్‌లోని హ్యోగో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త షిన్యా నరుసావా నేతృత్వంలోని బృందం గ్రహాంతరవాసుల నుంచి వచ్చే ప్రతిస్పందనను వినడానికి సిద్ధమవుతోంది.

## మూడోసారి వాయిదాపడిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పర్యటన



**న్యూఢిల్లీ, నవంబరు 25:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటన మరోసారి వాయిదా పడింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుడు, తదనంతర భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాదిలో ఆయన పర్యటన రద్దు కావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ 9న నెతన్యాహు భారత్‌లో పర్యటించాల్సి ఉంది. కానీ, సెప్టెంబర్ 17న ఇజ్రాయెల్ పార్లమెంటులో ఓటింగ్ జరగడంతో ఆ పర్యటన రద్దయింది. అంతకుముందు ఏప్రిల్‌లో కూడా ఆయన పర్యటన ఇదే విధంగా వాయిదా పడింది. ఇప్పుడు ఢిల్లీ పేలుడు కారణంగా మూడోసారి పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

## ఎల్టీటిఇ మహిళ వద్ద భారత్ ఓటర్ ఐడికార్డు




**న్యూఢిల్లీ, నవంబరు 25:** నిషేధిత ఉగ్రవాద సంస్థ ఎల్‌టీటీఈతో సంబంధాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీలంక మహిళ వద్ద భారత ఓటర్ ఐడీ ఉన్నట్టు తేలడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), భారత ఎన్నికల సంఘాన్ని అప్రమత్తం చేసింది. గుర్తింపు పత్రాల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరింది. మేరీ ఫ్రాన్సిస్కా అనే శ్రీలంక మహిళను 2022లో ఓ బ్యాంకు మోసం కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా అధికారులు ఆమె నుంచి భారత ఓటర్ ఐడీ, పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ ఇంకా యాక్టివ్‌గా ఉండటంతో అధికారులు ఆశ్చర్యపోయారు.

## భర్తపై గృహహింస కేసు పెట్టిన బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ



**ముంబయి, నవంబరు 25:** బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్ పై గృహ హింస ఫిర్యాదుచేయడంతో కేసు నమోదయింది. తన భర్త నుంచి గృహ హింస, క్రూరత్వం, మానిప్యులేషన్ ఎదుర్కొంటున్నానని ఆరోపిస్తూ ఆమె ముంబై కోర్టును ఆశ్రయించారు. డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ కింద కేసు దాఖలు చేయగా, న్యాయస్థానం పీటర్ హాగ్ కు నోటీసులు జారీ చేసింది. ఆస్ట్రియాకు చెందిన వ్యాపారవేత్త, హోటలియర్ అయిన పీటర్ హాగ్‌ను సెలీనా 2011లో వివాహం చేసుకున్నారు. వీరికి 2012లో కవల కుమారులు జన్మించారు. ఆ తర్వాత 2017లో మరోసారి కవలలకు జన్మనివ్వగా, వారిలో ఒకరు గుండె సంబంధిత సమస్యతో మరణించారు. సెలీనా జైట్లీ ప్రస్తుతం ఒకేసారి రెండు వైపులా న్యాయపోరాటం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేను వెంటాడుతున్న లైంగిక వేధింపుల కేసులు!



**తిరువనంతపురం, నవంబరు 25:** కేరళలోని పాలక్కాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్కూటతిల్‌ను లైంగిక ఆరోపణల వివాదం వీడటం లేదు. ఇప్పటికే ఇలాంటి ఆరోపణలతో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయనపై తాజాగా మరిన్ని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనకు సంబంధించినవిగా చెబుతున్న ఓ వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్, ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. లీకైన ఆడియోలో రాహుల్ ఒక మహిళతో మాట్లాడుతున్నట్లు ఉంది. గర్భం దాల్చిన మొదటి నెలలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ఆ మహిళ వివరిస్తుండగా, 'హాస్పిటల్‌కు వెళ్లు' అంటూ ఆయన కఠినంగా మాట్లాడినట్లు ఆ క్లిప్‌లో ఉంది. అంతేకాకుండా, నిన్ను గర్భవతిని చేయాలి, మన బిడ్డ కావాలి అని రాహుల్ సందేశం పంపినట్లుగా ఉన్న వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్ కూడా బయటకు వచ్చింది. అయితే ఈ ఆడియో, చాట్‌ల వాస్తవికత ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ కొత్త ఆరోపణలపై రాహుల్ మామ్కూటతిల్ స్పందించారు. తాను విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని, ఈ ఆరోపణలపై చట్టపరంగా ముందుకెళ్తానని తెలిపారు. నా ఫొటో పెట్టి ఆడియోను విడుదల చేశాక, అది నా గొంతు అవునో కాదో నన్ను అడగటంలో అర్థం లేదు. దేశంలోని ఏ చట్టాన్నీ నేను ఉల్లంఘించలేదు. విచారణ సరైన దశకు చేరుకున్నాక నేను చెప్పాల్సింది చెబుతానని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేరళ కాంగ్రెస్ నేత కె. మురళీధరన్ స్పందిస్తూ, రాహుల్‌పై చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని అన్నారు. రాహుల్ ప్రస్తుతం పార్టీలో లేరు. ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకుంటే, పార్టీ తదుపరి అడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక నటి, రచయిత్రి చేసిన లైంగిక ఆరోపణల నేపథ్యంలో రాహుల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, పార్టీ నుంచి సస్పెండైన విషయం తెలిసిందే.

# దాడులు ఆపకపోతే విధుల బహిష్కరణ

## ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 25:** రాష్ట్రంలోని ఆర్‌టిసి సిబ్బందిపై దాడులు ఆపకపోతే విధులను బహిష్కరిస్తామని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరించింది. సిబ్బందిపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదని, ఇలాగే దాడులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి బస్సులు అక్కడే ఆపి విధులను బహిష్కరిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న హెచ్చరించారు. గతంలో సిరిసిల్ల డ్రైవర్‌పై దాడిని మరువకముందే అక్టోబరు 24న హాకీంపేట డిపో సిబ్బందిపై, అడ్డువచ్చిన ప్రయాణీకులపై అమానుషంగా దుండగులు దాడి చేశారని, వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో ఫారూఖ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న యు.రమేష్, కండక్టర్‌పై 2 సంవత్సరాల క్రితం డ్యూటీలో ఉండగా దుండగులు దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉండి కండక్టర్ డ్యూటీ చేయలేకపోతున్నాడని, ఇతనికి ఓడీ డ్యూటీ ఇవ్వాలని కాళ్ళరిగేలా బస్‌భవన్ చుట్టూ తిరిగినప్పటికీ అవుటాఫ్ డిజిగ్నేషన్ డ్యూటీ ఇవ్వడానికి ఒప్పుకోకపోవడంతో జీవనోపాధి లేక పూట గడవని స్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ యాదగిరిగుట్టకు చెందిన డ్రైవర్‌ను ఒక ప్రయాణీకురాలు ఆపమన్నచోట ఆపలేదని తన భర్తకు ఫోన్ చేయగా, ఆమె భర్త, కుమారుడు వచ్చి డ్రైవర్‌ను విచక్షణా రహితంగా కొట్టి బూతులు తిట్టారు. ఈ దాడి చేసినవారిపై ఎలాంటి శిక్ష విధించలేదు. అలాగే హాయత్‌నగర్ డిపోకు చెందిన ఒక డ్రైవర్‌ను ఒక మహిళా ప్రయాణీకురాలు మెడపై కొట్టడంతో ఎముకలు దెబ్బతిని మెడికల్ అన్ ఫిట్ అయ్యాడు. ప్రస్తుతం ఇతనికి జీవనోపాధి కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబం నెట్టివేయబడిందన్నారు. విధి నిరహణలో దాడులకు గురైన సిబ్బందికి, యాక్సిడెంట్లకు గురైన సిబ్బందికి అవుటాఫ్ డిజిగ్నేషన్ డ్యూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి సిబ్బందిపై దాడులకు పాల్పడినవారిని అరెస్ట్ చేయుటకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు పోలీసు డిపార్ట్‌మెంట్‌కు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రికి, రవాణాశాఖ మంత్రికి, మేనేజింగ్ డైరెక్టర్‌కి లేఖలు ఇచ్చినట్లు తెలిపారు.

# సర్పంచ్ ఎన్నికల్లోనూ విజయం కాంగ్రెస్‌దే

## ప్రజాపాలనకు ప్రజల మద్దతు ఉంది

### ఢిల్లీలో మీడియా సమావేశంలో ఎంపి మల్లు రవి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,నవంబరు 25,ప్రభాతవార్త:** తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇస్తారని నాగర్ కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లు రవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ, ప్రజా పాలన వైపే ఓటర్లు మొగ్గుచూపారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలన సాగుతోందని అభివర్ణించారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారని స్వోత్కర్షలు చెపుకొన్నారు. పేదలకు సన్న బియ్యం, 200 యూనిట్ల కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల పట్ల ప్రజలు సంతృప్తిని చేస్తున్నారని మల్లు రవి స్పష్టం చేశారు. " ప్రజా ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డిపైన ప్రతిపక్షాలు అడ్డగోలు ఆరోపణలు చేశాయి. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు తప్పుడు ప్రచారం చేశారు. కానీసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించారు. ప్రజలు వారు అనుభవిస్తున్న కార్యక్రమాలకు అనుకూలంగా ఓటేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించారు" అని ఎంపీ వ్యాఖ్యానించారు.పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే మన రాష్ట్రానికి రావలసిన 3500 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తాయనీ ఆయన తెలిపారు. ఇంతకుముందే ఎన్నికలు పెట్టాలని ఆ ఎన్నికల్లో 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం భావించిందని గుర్తుచేశారు. 9వ షెడ్యూల్‌లో కేంద్రం చేర్చకపోవడం, కోర్టు తీర్పులు వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదని ఆవేదన చెందారు అందుకే పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పంచాయతీ ఎన్నికలకు వెళ్తామనీ మల్లు రవి తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మకంగా విమర్శించాలి. ఈమధ్య కెటిఆర్ లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు. భూముల కేటాయింపు, వాటి కన్వర్షన్‌కు అనుమతులు ఇచ్చిందే బిఆర్ఎస్ ప్రభుత్వమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ భూములు ఖాళీగా ఉండకూడదని చెప్పి వారికి కన్వర్షన్‌కు అవకాశం ఇచ్చారు. అంటే ఆ భూమిని ఇంకో రకంగా మార్చుకోవడానికి కావలసినటువంటి అనుమతి మాత్రమే ఇచ్చారని ఎంపీ వివరించారు. "మీరు మాట్లాడినప్పుడు టీవీల్లో పేపర్లలో చూపిస్తారని అనుకొని మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం చేయడం ఆపండి అని సలహా ఇచ్చారు. కెటిఆర్ మీ సొంత చెల్లెలు మీ గురించి ఏం చెబుతుందో వినండి. మీరు చేసిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాల వలనే ప్రజలు మళ్లీ మీకు బుద్ధి చెప్తారని జోస్యంచెప్పారు. హర్యానాలో దళిత ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నేను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశాను. అలాగే పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని 8 పేజీల లేఖ రాశాను. ఈ విషయంపై రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పూరన్ కుమార్ కుటుంబానికి అండగా నిలుద్దామని చెప్పారు.తన పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన తలసేమియా బాధితురాలికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3 లక్షల సాయం అందిందనిఎంపీ మల్లు రవి వెల్లడించారు. సాయం చేసిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెప్పారు.

# టెట్ దరఖాస్తుల్లో ఎడిట్ సౌకర్యం

## డిసెంబర్ 1 వరకు అవకాశం

## 29 వరకు దరఖాస్తుకి గడువు

## జనవరి 3 నుంచి 31 వరకు పరీక్షలు

**హైదరాబాద్,ప్రభాతవార్త,నవంబరు 25:** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులో తప్పులు ఉంటే ఎడిట్ చేసుకోవడానికి మంగళవారం నుంచే అవకాశం కల్పించినట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2026 ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ తెలిపారు. డిసెంబర్ 1 వరకు ఎడిట్ సౌకర్యానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. టెట్-2026 నోటిఫికేషన్ వెలువడిన మొదటి రోజు నుంచే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు 1,26,085 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు ప్రకటించారు. ఫీజు చెల్లించిన వారిలో పేపర్-1కి 46,954 దరఖాస్తులు, పేపర్-2కి 79,131 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ టీచర్లకి కూడా టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన నేపథ్యంలో ఇన్‌సర్వీస్ టీచర్లు కూడా టెట్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తులను ఈనెల 29వరకు స్వీకరించనున్నారు.

టెట్-2026 పరీక్షలను జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఒక్కో పేపర్‌కి ఫీజు రూ. 750గా నిర్ణయించగా రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. టెట్-2026 ఫలితాలను ఫిబ్రవరి 10 నుంచి 16 మధ్యలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలతోపాటు ఇతర ఏవైనా సందేహాలు, సమస్యల నివారణ కోసం అభ్యర్థులు 7093708883/ 7093708884/ 7093958881/ 7093468882/ 7032901383/ 9000756178 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

## టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రధానికి మెయిల్

### పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టాన్ని సవరించాలి: యుటిఎఫ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 25:** సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. విద్యాహక్కు చట్టం అమలు, ఎన్సీటిఈ నోటిఫికేషన్‌కి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) పిలుపు మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యాలయం నుండి ప్రధానమంత్రి కార్యాలయానికి గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మెమోరాండం సమర్పించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది, రాష్ట్రంలో 45 వేలమంది ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న టెట్ పరీక్షను 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపునిస్తూ, విద్యాహక్కు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిటిఈ నోటిఫికేషన్‌కి ముందు నియామకమైన టీచర్లు టెట్ పరీక్ష వ్రాయాల్సిన అవసరం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినందునే గత 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు టెట్ వ్రాయలేదన్నారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా రెండేళ్ళలో టెట్ పాస్ కాకపోతే ఉద్యోగానికి ఉద్వాసన పలుకుతామని చెప్పడం సమంజసం కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రివ్యూ పిటిషన్ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 1నుండి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టాన్ని సవరించి సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర, కేంద్రంతోపాటు అన్ని జిల్లా కేంద్రాలు, కొన్ని డివిజన్ కేంద్రాల నుండి ప్రధానమంత్రికి వినతిపత్రాలను మెయిల్, పోస్ట్ ద్వారా పంపించారని తెలిపారు. నేటి(బుధవారం) నుండి నెలాఖరు వరకు రాష్ట్రంలోని పార్లమెంటు సభ్యులందరికీ వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు.

# మార్పులు మేధావులతోనే సాధ్యం: ఆర్.కృష్ణయ్య

## జాతీయ బీసీ సేన అధ్యక్షుడిగా కత్తి చంద్రశేఖరప్ప



జాతీయ బీసీసేన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కత్తి చంద్ర శేఖరప్పకు అందచేస్తున్న ఆర్ కృష్ణయ్య, అరుణ్ కుమార్

**షాద్‌నగర్, నవంబరు 25, ప్రభాతవార్త :** ప్రపంచంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పులు మేధావులతోనే సాధ్యమైందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కత్తి చంద్రశేఖర అప్ప, స్రవంతిలను మంగళవారం ఆర్ కృష్ణయ్య, అరుణ్‌కుమార్ లు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఇటీవలే జాతీయ బీసీసేన నూతన సంఘాన్ని ప్రకటించిన అనంతరం మంగళవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో సంఘం సర్టిఫికెట్‌ను ఆర్ కృష్ణయ్య అరుణ్ కుమార్‌చే కత్తి చంద్రశేఖర అప్ప, స్రవంతిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ ఉద్యమం అత్యంత బలంగా ఉందని, రానున్న కాలం బీసీ రాజ్యమేనని వెల్లడించారు. జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప మాట్లాడుతూ జాతీయ బీసీ జనసేన ఏర్పాటుకు పూర్తిగా సహకరించిన జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, అరుణ్ కుమార్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ జనసేన మరో మహిళా నాయకురాలు స్రవంతి మాట్లాడుతూ అనుకున్న విధంగా బీసీ జనసేన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడం ఆ సర్టిఫికెట్ను ఆర్ కృష్ణయ్య అరుణ్ కుమార్ చేతిలో మీదుగా అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఇదో గొప్ప విజయం అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జాతీయ బిసి సేన నాయకులు బోయ చెన్నయ్య స్రవంతిరాజ్ తదితరులు ఉన్నారు.

# బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్


## 30న హైదరాబాద్‌లో 'బిసిల యుద్ధభేరి సభ'

## డిసెంబర్ 8,9 తేదీల్లో అఖిలపక్షంతో ఢిల్లీలో ధర్నా

### బిసి జెఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,నవంబరు 25,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో బిసి సమాజానికి తీరని ద్రోహం చేసిందని బిసిజేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రెండేండ్లు బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై ఈ నెల 30న యుద్ధభేరి సభను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, డిసెంబర్ 8, 9 తేదీల్లో అఖిలపక్షం తీసుకెళ్లి ఢిల్లీలో ధర్నా చేస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ కుందారపు గణేష్ చారి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పంచాయతీ రిజర్వేషన్ల తప్పుల తడాక అని శాస్త్రీయత లేదని విమర్శించారు. నల్లగొండలో 2019లో బిసి విభాగంలో సర్పంచ్ స్థానాలు 164 ఉంటే, ప్రస్తుత 2025లో 140 స్థానాలే ఇచ్చి, 24 స్థానాలను తక్కువ చేశారని తెలిపారు.

అంటే, జిఒ 46ను కూడా సక్రమంగా అమలు చేయకుండా అగ్రవర్ణాలకు అధిక స్థానాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన రాష్ట్రాల్లో ఓట్‌చోరీ జరిగిందని అంటున్నారని, తెలంగాణ లో రిజర్వేషన్ల చోరీ జరిగిందని ఆయన గ్రహించాలని కోరారు. వెంటనే పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాల డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి జె.ఎస్ కో ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, నేతలునీటి మల్లయ్య, వేముల రామకృష్ణ, విక్రమ్ గౌడ్, శ్యాంకురుమ, మహిళా అధ్యక్షురాలు మణిమంజరి, కౌత్తల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జకృష్ణ, గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు

# నారయపేట కొడంగల్ లిఫ్ట్‌ఇరిగేషన్ పేరు మార్పు

**హైదరాబాద్,నవంబరు 25,ప్రభాతవార్త:** నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరును "మక్తల్ నారాయణపేట్ కొడంగల్" లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా మార్పుచేస్తూ జివో నెంబరు 45ను విడుదల చేశారు. "మక్తల్,నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం " తెలంగాణలో నారాయణపేట జిల్లాకు తాగునీరు అందించడానికి, నారాయణపేట, కొడంగల్,మక్తల్ నియోజకవర్గాలలోని సుమారు 100,000 ఎకరాలకు సాగునీరు అందించడానికి ఉద్దేశించబడిన ఒక ప్రతిపాదిత ప్రాజెక్ట్. అంచనా వ్యయం సుమారు రూ.4,350 కోట్లు ఉంటుంది.ఈ ప్రాజెక్ట్ సొరంగం వ్యవస్థకు బదులుగా ప్రెజర్ మెయిన్ టెక్నాలజీని ఉపయోగించి రెండు దశల్లో పూర్తి చేయబడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత సంవత్సరం ఫిబ్రవరి శంకుస్థాపన చేయడంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగుతోంది, అయినప్పటికీ ఇది చట్టపరమైన సవాళ్లు నిరసనలను కూడా ఎదుర్కొంది.నిర్మాణం రెండు దశల్లో పూర్తవుతుంది. భూత్పూర్ జలాశయం నుండి నీటిని ఎత్తి, వుట్కూర్, జయమ్మ, కనకుర్తి వంటి చెరువుల ద్వారా మళ్లిస్తారు.

# గల్ఫ్ ఎన్నారై పాలసీ అధ్యయనం కోసం డిసెంబర్‌లో జిల్లాల పర్యటన

## 3, 4 తేదీలలో నిర్మల్ జిల్లా సందర్శన

**హైదరాబాద్,నవంబరు 25,ప్రభాతవార్త:** తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా గల్ఫ్ వలసలు, సమస్యలు, పరిష్కారాలపై అధ్యయనం చేసే క్రమంలో డిసెంబర్ నెలలో గల్ఫ్ ప్రభావిత జిల్లాలలో పర్యటిస్తామని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మందభీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు, అక్కడి నుంచి తిరిగి వచ్చిన వారితో సహా గల్ఫ్ కుటుంబాలను కలిసి వారి నుంచి సమాచారం సేకరిస్తామని వారు తెలిపారు. ముందుగా నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, జన్నారం ప్రాంతాలలో డిసెంబర్ 3, 4 తేదీలలో పర్యటిస్తామని, జిల్లా కలెక్టర్, ఎస్పీ, కార్మిక, ఉపాధి, మహిళ, శిశు అభివృద్ధి తదితర శాఖల అధికారులను, విద్యావేత్తలను, రిక్రూటింగ్ ఏజెన్సీలు, సామాజిక సంఘాల ప్రతి నిధులతో సమావేశమవుతామని వినోద్, భీంరెడ్డిలు వివరించారు. కమిటీకి అవసరమైన ప్రయాణ, వసతి సౌకర్యాలు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని వారు తెలిపారు.

# యువ ఐపిఎస్‌లకు పునశ్చరణ తరగతులు





**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడ్డ నలుగురు యువ ఐపిఎస్ అధికారులకు మంగళవారం డిజిపి కార్యాలయంలో ఒకరోజు పునశ్చరణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా 2023 బ్యాచ్‌కు చెందిన నలుగురు అధికారులు డిజిపి కార్యాలయంలోని పలు విభాగాలను స్వయంగా సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. మొదట నలుగురు అధికారులు శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల నిర్వహణపై ఆయన నలుగురు అధికారులకు వివరించారు. పోలీసు విధి విధానాలు, ఏ ఏ విభాగాలు ఎలా పనిచేస్తాయి అనే విషయాలను కూడా ఆయన వివరించారు. ఆర్గనైజేషన్ విభాగం గురించి ఏఐజి రమణ కుమార్ వివరించారు. టెక్నికల్ సర్వీసెస్ గురించి అదనపు డిజి శ్రీనివాసరావు, మహిళల భద్రత గురించి అదనపు డిజి చారు సిన్హాలు వివరించారు.

**షూటర్ ఈశా సింగ్‌కు మహేష్ భగవత్ అభినందన** కాగా మహిళా షూటర్ ఈశా సింగ్ శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌తో మంగళవారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో జరిగిన టోర్నమెంట్లలో ఈశా సింగ్ అనేక పతకాలను సాధించడం తెలిసిందే. ఈ సందర్భంగా శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌తో ఈశా సింగ్‌ను శాలువకప్పి సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరింతగా రాణించాలని ఆ శాభావం వ్యక్తం చేశారు.

**కాశ్మీర్ టు కన్యాకుమారి సైకిల్ యాత్రలో పాల్గొన్న టి. పోలీసులకు అభినందన:** కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రలో పాల్గొంటున్న తెలంగాణ పోలీసు విభాగానికి చెందిన బృందాన్ని శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ మరో కార్యక్ర మంలో అభినందించారు. సర్దార్ వల్లభ భాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా చేబట్టిన ఈ యాత్ర లో ఖమ్మం కానిస్టేబుల్ గోపి సహా మరికొందరు పాల్గొంటున్నారు. వీరి యాత్రను మహేష్ భగవత్ అభినందించడంతో పాటు స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రతమంలో ఐజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

## ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేసిన సిపిఎస్ ఉద్యోగులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 25:** దేశవ్యాప్తంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపిఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సిపిఎస్ ఉద్యోగులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఎన్ఎంఓపిఎస్) జాతీయ అధ్యక్షుడు వి.కె.బంధు, సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ మాట్లాడారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధికారులు పాత పెన్షన్ పునరుద్ధరించాలని,, ఎన్‌పిఎస్‌ను రద్దు చేయాలని యుపిఎస్ వద్దని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్ హాజరైయ్యారు. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరించాలని ఎన్ఎంఓపిఎస్ అనేక సంవత్సరాలుగా పోరాడుతోందని జాతీయ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ తెలిపారు. ఈ పోరాటం ఫలితంగానే నాలుగు రాష్ట్రాల్లో పాత పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరించారని, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయగా, పంజాబ్‌లో ఓపిఎస్‌ను పునరుద్ధరించినట్లు ప్రకటించారని తెలిపారు.

ఇటీవల వోట్ ఫర్ ఓపీఎస్‌తో అధికారంలోకి వచ్చిన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు, పంజాబ్ ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్‌ను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 1 కోటి మంది ఉద్యోగులు ఎన్‌పిఎస్, యుపిఎస్ మూలంగా సంతోషంగా లేరని రుజువైందన్నారు. ఇప్పటివరకు కేవలం 3 శాతం మంది ఉద్యోగులు మాత్రమే యుపిఎస్ ఫారమ్ నింపారని, 97 శాతం మంది ఉద్యోగులు యుపిఎస్‌ని పూర్తిగా తిరస్కరించారని స్థిత ప్రజ్ఞ అన్నారు.

# 50 శాతం సబ్సిడీపై 5,500 క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీ: మంత్రి తుమ్మల





**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** జాతీయ ఆహారభద్రత మిషన్ పథకంలో భాగంగా 16 జిల్లాల్లోని రైతులకు 50 శాతం సబ్సిడీపై 5,500 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటల్లో అంతర పంటల సాగు ఆవశ్యకత గురించి తెలిపారు. అలాగే వరి పంట కోత అనంతరం వరి కొయ్యలను కాల్చకుండా భూమిలో దున్ని పర్యావరణాన్ని సంరక్షి ంచాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. పంట అవశేషాల లేదా వ్యర్థాల నిర్వహణపై ఒక లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ రైతు నేస్తం కార్యక్రమంలో కూడా వివిధ జిల్లాలలోని రైతు వేదికల నుండి దాదాపు 30 వేల మంది రైతులు హాజరయ్యారని అన్నారు. రైతులు అనేక విషయాలు, పథకాల గురించి వెంటనే తెలుసుకోగలుగుతున్నారని, దీంతో ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తున్నట్టు వెల్లడించారు.విత్తన చట్టం ముసాయిదా బిల్లు ద్వారా రైతుల హక్కులు, ప్రయోజనాలకు భంగం కలుగుతుం దన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమి షన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ ఛైర్మన్ బి. అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి: వర్సిటీ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు అన్ని రాష్ట్రాల ఉద్యాన విభాగాలు, కృషివిజ్ఞాన కేంద్రాలు దృష్టిసారించాలని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వెల్లడించింది. అలాగే రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే విదేశీ పండ్ల సాగును పెద్ద ఎత్తున చేపట్టాలని స్పష్టం చేసింది. ఈమేరకు విశ్వవిద్యాలయం అధ్యయన నివేదికలో ఈవిషయాలను తెలిపింది. తెగుళ్ల నివారణ, ఉత్తమ సాగునిర్వహణ పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. విస్తృతంగా రైతు శిక్షణకార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొంది. ఇదేసమయంలో అవకాడో, స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్, రాంబూటాన్ బ్లూబెర్రీ లాంగన్ మకాడమియా నట్ కివీ మ్యాంగోస్టీన్ ఉత్తమ పోషక విలువలు, మార్కెటింగ్ సామర్థ్యంగల విదేశీరకాలఫలాలను సాగుచేయడం లాభదాయకమని తెలియచేసింది.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

## పదవీవిరమణను 61 సంవత్సరాలకి పెంచాలి

### టూరిజంమంత్రికి చాడ వెంకట్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 25:** తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో గత 23 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియర్(ఏఐటియుసి) తరపున టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి విజ్ఞప్తి చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విఎస్ బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మంత్రిని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ క్రమబద్ధీకరణ, ఇతర ఉద్యోగులతోపాటు పదవీవిరమణను 61 సంవత్సరాల వయోపరిమితిని పెంచాలని కోరారు. టూరిజం కార్పొరేషన్లో గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులు పనిచేస్తున్నారని వారందరూ శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనులు చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలోనే సమానపనికి సమాన వేతనాలు ఇస్తామని యాజమాన్యం చెప్పింది. కానీ అది అమలు కావడం లేదని... దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని అన్నారు. గతంలో కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం జరిగిందని కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని కాబట్టి మానవతా దృక్పథంతో శాశ్వత ఉద్యోగుల మాదిరిగా సమానపనికి సమాన వేతనం ఇస్తూనే పదవీ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచేలా తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా మంత్రి జూపల్లిని చాడ వెంకట్ రెడ్డి కోరారు.

# నూతన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

## సింగరేణి కార్మిక సంఘాల జెఏసి నాయకులు





లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేస్తున్న సింగరేణి కార్మిక సంఘాల జెఏసి నాయకులు

**నస్పూర్, నవంబరు 25, ప్రభాతవార్త:** నూతన 4 లేబర్‌కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రదు చేసి, పాత 29 కార్మిక చట్టాలనే కొనసాగించాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, వైఖరిని నిరసిస్తూ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్‌లలో సింగరేణి ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మికులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ముస్కె సమ్మయ్య, ఎస్‌కె బాజీ సైదా, జెట్టి శంకర్ రావు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డిలు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం నుంచి అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి కార్మికులు సాధించుకున్న 8గంటల పని విధానాన్ని మారుస్తూ, కార్మికులకు అందాల్సిన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను కాలరాస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా 12గంటల పని విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్ర మోహన్, ఏనుగు రవీందర్ రెడ్డి, గరిగే స్వామి, నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, వెంగళ కుమార స్వామి, నాయకులు బాణేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవానికి పల్లెలు ససేమిరా!

**సర్పంచ్‌కు అవకాశం ఇస్తే ఎంపిటిసికి సహకరిస్తా**

**మేజర్ గ్రామపంచాయతీలో కోటిన్నరకంటె ఎక్కువే ఖర్చు!**

**కాంగ్రెస్, కమ్యూనిస్టులు తెలంగాణ జనసమితి సమాజమిత్రులుగా చెట్టపట్టాల్**

**నిజామాబాద్‌లో విడిసిలదే రాజ్యం, సర్పంచ్ పదవి కోసం వేలం పాటలు**

**హైదరాబాద్,నవంబరు 25,ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమైందని తెలియడంతో పల్లెలో ఎన్నికల మంత్రాంగంతో పండగ వాతవారణము మొదలైంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకున్నా అభ్యర్థులను రాజకీయ పార్టీలు బలపరుస్తాయి. సర్పంచ్, వార్డుమెంబర్ పదవులు దక్కించుకోవడానికి నజరానాలు, ఎంపిటిసి జడ్పీటిసి వంటి పోటీలకు సహకరిస్తామంటూ భరోసాలు ఇస్తు రాయబారాలు జరుపుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు రంగంలోకి దిగి సర్పంచ్‌లుగా ఎవరు ఉండాలో నిర్ణయాధికారం చేతుల్లోకి తీసుకొంటుందని వదంతులు గుప్పుమంటున్నాయి. వేలంపాటలతో సర్పంచ్ పదవులు దక్కించుకొనేందుకు ఆర్థికంగా బలోపేతంగా ఉన్నవారు కసరత్తు చేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవి కోసం బరిలో దిగిన అభ్యర్థి కోటిన్నర ఖర్చుచేయడానికి వెనకడటంలేదని తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకులు ఎలాగైనా గ్రామసర్పంచ్ పీఠంపై పాగావేయాలని సహజ మిత్రులైన తెలంగాణ జనసమితి వామపక్షాలు, పొత్తుల కోసం తాపత్రయపడుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా అధికార పార్టీ నాయకుల్లో గెలుపు ధీమా అధికంగా ఉంది. ఎస్సి, ఎస్టి,బిసి లకు రిజర్వ్ చేసిన గ్రామపంచాయతీలో కొంచెం ఆర్థిక పరపతి ఉన్నవారు పోటీకి సన్నద్ధమ వుతున్నారు. ఇద్దరు వ్యక్తులు తీవ్రగా పోటీపడుతున్న గ్రామాల్లో ఒకరిని సర్పంచి, మరొకరిని ఎంపిటిసి అభ్యర్థిగా బరిలోకి దింపాలని యోచిస్తున్నారు. దీనికోసం కూడా మంతనాలు చేస్తున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రిజర్వేషన్లు ఖరారవటంతో పల్లెల్లో చర్చలు జోరందుకున్నాయి . సర్పంచి పీఠంపై కన్నేసిన వారంతా జిల్లా రాష్ట్ర నాయకులను ప్రసన్నం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.42శాతం ప్రామాణికంగా చేసుకొని రిజర్వు,అన్ రిజర్వు గుర్తించిన గ్రామసర్పంచ్‌ల రిజర్వేషన్ ప్రస్తుతం మారింది.దీనితో దసరా నుంచి ఖర్చుపెట్టకొంటూ వచ్చిన గ్రామల్లోని నాయకుల పరిస్థితిగందరగోళంలో పడింది. ఖర్చుపెట్టినోడు ఒకడు ఇప్పుడు తీరటైంకు వేరొకడికి అనుకూలంగా రిజర్వేషన్ మారడంతో గగ్గోలు పడుతున్నారు. రిజర్వేషన్ల అనుకూలత, గెలుపు అవకాశాలపై లెక్కలు వేసుకొని మంతనాలు జరుపుతున్నాయిఈసారి ఎన్నికల్లోనూ సర్పంచి, వార్డుసభ్యుల స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని కొన్నిచోట్ల ప్రయత్నాలు జరుగుతున్నా గత అనుభవాల దృష్ట్యా ఆ దిశగా గ్రామస్థాయి నాయకులు ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలనే ఉద్దేశంతోగత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాలు ప్రకటించింది. తెలంగాణలో 12733 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 112288 వార్డులకు ఉన్నాయి. వీటిలో 100శాతం ఎస్టీ జనాభా, షెడ్యూల్డ్ గ్రామాలు కలిపి పంచాయతీల్లో సర్పంచి పదవులు ఎస్టీలకు దక్కనున్నాయి. మిగిలిన గిరిజనేతర పంచాయతీల్లో రొటేషన్ ప్రకారం జనరల్‌కు రిజర్వ్ బిసిలకు ఎస్సీలకు గ్రామ పంచాయతీల్లో సర్పంచి స్థానాలను రిజర్వ్ చేశారు. స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన నియోజకవర్గంలో ఎకగ్రీవంగా సర్పంచ్ ఎన్నికలు జరిగితే 20లక్షల రూపాయలు ఆ గ్రామానికి అందజేస్తానని ప్రకటించారు. ఖమ్మం నియోజకవర్గంలో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ. 10 లక్షల చొప్పున ప్రోత్సాహకంగా అందజేస్తామని తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా 2134 సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. 2019లో 12732 గ్రామపంచాయతీ సర్పంచ్‌లు వార్డుమెంబరుల కోసం ఎన్నికల ప్రకటన జారీచేయగా ఏకగ్రీవాలు 16.76శాతం పోను 10571 గ్రామాలలో సర్పంచ్‌ల కోసం ఎన్నికలు జరిపారు.అదేవిధంగా ఒకలక్షా 30వేల వార్డుమెంబర్ స్థానాలలో 29,985 మంది ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఏకగ్రీవ ప్రోత్సాహం పంచాయతీలకు నజరానాలు దక్కలేదు. మారుమూల గ్రామపంచాయతీలలో గత పాలన కాలంలో సర్పంచులకు బిల్లుచెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా చితికిపోవడంతో ఇప్పుడు అనేక గ్రామాలలలో పోటీకి సిద్దపడటంలేదు. కేంద్రం నుంచి వచ్చే నిధులు మినాహా రాష్ట్రం నుంచి ఏలాంటి నిధులు రావడంలేదని దీనికోసం పోటీ పడటం అవసరామా అనే చర్చ కూడా కొన సాగుతోంది. పట్టణాలకు ఆనుకొన్నా గ్రామాలలో వార్డుమెంబరు సర్పంచ్ పదవిలకు డిమాండ్ ఉంది. సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి ఎంపిటిసిగా మిమ్మల్ని గెలిపించుకొంటా అంటూ ప్రత్యర్థులతో రాయబారాలు కూడా జరుగు తున్నాయి.

# భవిష్యత్‌పై విశ్వాసం కల్పించేలా బ్రాండింగ్..

**తెలంగాణ గతం.. వర్తమానం.. భవిష్యత్‌లను ప్రతిబింబించాలి..**

**తెలంగాణ బ్రాండింగ్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్25:** అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న సమ్మిట్‌కు సంబంధించి బ్రాండింగ్‌పై తన నివాసంలో మంగళవారం రాత్రి సీఎం సమీక్ష నిర్వహించారు. గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి వివిధ సంస్థలు రూపొందించిన ప్రచార చిత్రాలు, వీడియోలను ముఖ్యమంత్రి వీక్షి ంచి పలు మార్పులు చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారత్ ఫ్యూచర్ సిటీలో విభాగాల వారీగా మనం చేపట్టే పనులకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. పెట్టుబడదారులకు మనం కల్పించే సదుపాయాలను సమగ్రంగా వివరించాలన్నారు. హైదరాబాద్‌కు అనుకూలాం శాలైన ఇన్నర్ రింగు రోడ్డు, అవుటర్ రింగు రోడ్డు, రానున్న రీజినల్ రింగు రోడ్డు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్ తో పాటు తెలంగాణలోని కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతను వివరించాలని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేని అంశాన్ని, పెట్టుబడుల విషయంలో మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని బలంగా నొక్కి చెప్పాలని సీఎం సూచించారు. తెలంగాణ బ్రాండింగ్‌కు సంబంధించి మన రాష్ట్రానికే పరిమితమైన, వైవిధ్యమైన రామప్ప ఆలయంలోని నంది, సమ్మక్క సారక్క జాతర, నల్లమల్ల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు తదితర అంశాలతో పాటు తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన పి.వి. నరసింహారావు వంటి ప్రముఖులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కదానికి బ్రాండింగ్‌లో చోటు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ వేదికలను బ్రాండింగ్‌కు సమర్థంగా వినియోగించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సందీప్ కుమార్ సుల్తానియా, శశాంక, ఇ.వి. నరసింహారెడ్డి, ముష్రాఫ్ అలీ, సర్ఫరాజ్ అహ్మద్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో సమాజానికి శాస్త్రవేత్తలు సేవ చేయాలి

**ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షు పాఠక్**

**ముగిసిన 115వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ కార్యక్రమం**





శిక్షణ పూర్తి చేసుకున్న శాస్త్రవేత్తలను అభినందిస్తున్న ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షు పాఠక్, కావేరి విశ్వవిద్యాలయం విసి డా.ప్రవీణ్ రావు,.ఐసిఎఆర్ నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ గోపాల్ లాల్,తదితరులు

**అత్తాపూర్ నవంబరు 25, ప్రభాతవార్త :** దేశంలోని రైతులకు సేవ చేయడంతో పాటు వ్యవసాయంలో సవాళ్లను పరిష్కరించడానికి యువశాస్త్రవేత్తలు నిబద్ధతతో కృషి చేయాలని పలువురు ముఖ్యఅతిథులు దిశానిర్దేశం చేశారు.మంగళవారం రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో 115వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.అతిథులుగా ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షు పాఠక్, కావేరి విశ్వవిద్యాలయం విసి డా.ప్రవీణ్ రావులు హాజరై దేశంలోని 22 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 35 వ్యవసాయ విభాగాలకు చెందిన 107 మంది ప్రొబేషనరీ శాస్త్రవేత్తలు తమ 3దశల ఫౌండేషన్ శిక్షణను పూర్తి చేసుకొని వివిధ ఐసిఎఆర్ సంస్థలలో పోస్టింగ్‌లను పొందిన శాస్త్రవేత్తలను అభినందించారు.అనంతరం ఇక్రిసాట్ జనరల్ డైరెక్టర్ డా.హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ నార్మ్ ఫర్ అగ్రికల్చరల్ రిసెర్చ్ సర్వీస్ (ఎఆర్ఎస్) యొక్క ప్రధాన సామర్థ్యం ఐసిఎఆర్ యొక్క 2025 దార్శనికతను సాధించడంలో దోహదపడే ప్రొఫెషనల్ పరిశోదకుల కేడర్‌ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.దేశంలోని అత్యధిక జనాభాకు సేవ చేసే ఏకైక వృత్తి వ్యవసాయ శాస్త్రవేత్త వృత్తి అన్నారు.మార్పును అంగీకరించి ,వృత్తిలో పురోగతి సాధించడానికి నిజాయితీ, వినయంతో సమాజానికి సేవ చేయాలని సూచించారు.వృత్తికి అర్హుడిగా తనను తాను నిరూపించుకుంటూ ఎదగడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు.గౌరవ అతిథి కావేరి విశ్వవిద్యాలయం విసి డా.ప్రవీణ్ రావు మాట్లాడుతూ పరిశోధన కార్యకలాపాలలో సాంకేతిక జోక్యం తప్పనిసరని విజయం సాధించడానికి ఇతర విభాగాలు మరియు ప్రసిద్ధ సంస్థలతో సహకారం చాలా అవసరంపరిశోధనను అనువదించేటప్పుడు వాటాదారులను చేరుకోవడానికి కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవని సూచించారు.ఐసిఎఆర్ నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ రైతు సమాజానికి సేవ చేయడం,ముఖ్యంగా చిన్న రైతులు, యువశాస్త్రవేత్తలకు నినాదం కావాలన్నారు. నిజాయితీ,సమగ్రత ,కృషి వల్ల కేరీర్‌లో ప్రయోజనాలు లభిస్తాయని వ్యక్తిగత జీవితంలో శ్రేయస్సు కోసం కుటుంబ ,తల్లిదండ్రులతో సంబంధాన్ని కొనసాగించడం చాలా అవసరం అన్నారు.
అనంతరం డాక్టర్ సందీప్,డాక్టర్ మేఘ శర్మలను ఉత్తమ శిక్షణార్థులుగా ఎంపిక చేసి సత్కారించారు.కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ డి. దామోదర్ రెడ్డి, కోర్సు పాఠ్యాంశాల్లో తీసుకు వచ్చిన ఆవిష్కరణలు, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ శిక్షణ మొదలైన వాటిపై నొక్కి చెబుతూ ఫోకర్స్ నిర్వహణ యొక్క వివరణాత్మక నివేదికను సమర్పించారు. సహకోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పార్కిన్సన్స్‌పై అద్భుత ఫలితాలు సాధించిన ఆసీస్ శాస్త్రవేత్తలు



**సిడ్నీ,నవంబరు 25:** పార్కిన్సన్స్ వ్యాధిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చుకునే ముఖ్యమైన పరిశోధనా ఫలితాలను ఆస్ట్రేలియా పరిశోధకులు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా మెదడులోని రక్తనాళాల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఇదే వ్యాధి ముదరడానికి ప్రధాన కారణమని వారు తేల్చారు. ఈ పరిశోధన భవిష్యత్తులో పార్కిన్సన్స్‌కు కొత్త చికిత్సా మార్గాలను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు పార్కిన్సన్స్‌కు మెదడులో ఆల్ఫాసిన్యూక్లిన్ అనే ప్రోటీన్ పేరుకుపోవడమే కారణమని భావించేవారు. అయితే, ఆస్ట్రేలియాలోని న్యూరోసైన్స్ రీసెర్చ్ ఆస్ట్రేలియా సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ప్రోటీన్ల కంటే మెదడులోని రక్తనాళాల్లో చోటుచేసుకునే మార్పులే వ్యాధి తీవ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తేలింది. "సంప్రదాయకంగా పరిశోధకులు ప్రోటీన్లు, నరాల కణాల నష్టంపైనే దృష్టి పెట్టారు. కానీ, మేము మెదడులోని రక్తనాళాల వ్యవస్థపై దాని ప్రభావాన్ని చూపించగలిగాం" అని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డెర్యా డిక్ తెలిపారు. తమ అధ్యయనంలో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో రక్తనాళాలు బలహీనపడటాన్ని, ముఖ్యంగా పనికిరాని రక్త కేశనాళికల అవశేషాలు పెరగడాన్ని గుర్తించినట్లు డెర్యా వివరించారు. దీనివల్ల మెదడులో రక్త ప్రసరణ, బ్లడ్‌బ్రెయిన్ బ్యారియర్ పనితీరులో కూడా మార్పులు వస్తున్నాయని కనుగొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్, యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ సహకారంతో సాగిన ఈ పరిశోధన ఫలితాలను బ్రెయిన్ జర్నల్‌లో ప్రచురించారు. రక్తనాళాల్లో వస్తున్న ఈ మార్పులను లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తే, వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇదే తరహా మార్పులు అల్జీమర్స్, ఇతర మతిమరుపు వ్యాధులలో కూడా ఉన్నాయా అనే కోణంలో అధ్యయనం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పార్కిన్సన్స్ అనేది కదలికలు, మానసిక ఆరోగ్యం, నిద్ర వంటి సమస్యలకు దారితీసే నాడీ సంబంధిత వ్యాధి. దీనికి ఇప్పటివరకు పూర్తిస్థాయి నివారణ లేదు.

# ఇసుక మాఫియాతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కు

## ప్రజాపాలన అంటే ఇదేనా?: మాజీ మంత్రి హరీష్‌రావు



మంగళవారం హుజురాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించిన తర్వాత రాష్ట్రంలోని రైతాంగం కోసం.. మత్స్యకారుల కోసం.. గొల్ల, కురుమల కోసం.. సాగునీరు, తాగునీటి కోసం ఎక్కడ వర్షపు చుక్క పడ్డ వాటిని ఒడిసి పట్టుకుని రాష్ట్ర అభివృద్ధికి వినియోగించామని ఆ కోణంలోనే ఆనాడు కేసిఆర్ హాయాంలో రాష్ట్రంలో 1200 చెక్‌డ్యాంలు, వేలాది కోట్ల ఖర్చుతో నిర్మిస్తే ఇసుక మాఫియాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం కుమ్మక్కై చెక్‌డ్యాంలను పేల్చివేస్తున్నారని ఇదేనా ప్రజా పాలన అంటే అని హరీష్ పేర్కొన్నారు. డ్యాం పేల్చివేసి రోజులు గడుస్తున్న ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.బాధ్యులైన వారిని అరెస్టు చేయలేదంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఘాటు విమర్శలు చేసారు. మంగళవారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల గ్రామాల మధ్యన ఉన్న చెక్‌డ్యాంను ఇసుకాసురులు పేల్చివేసి నీరు వాగులో వృదా పోతున్న చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని హరీష్‌రావు తీవ్రంగా దుయ్యబట్టారు. చెక్‌డ్యాం తెగిపోయిన ప్రదేశానికి మాజీ మంత్రులు హరీష్‌రావుతో పాటు గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, సుంకె రవికిషన్, డాక్టర్ సంజీవ్‌తో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ శ్రేణులు చెక్ డ్యాం పేల్చివేసిన ప్రాంతానికి చేరుకుని గంటపాటు పరిశీలించారు. ఈ సంఘటనపై మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ నెల 15రోజుల క్రితం అత్యధికంగా కురిసిన భారీ వర్షాల వల్ల కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం నిండిపోయి 14 గేట్లు ఎత్తివేసిన నెల రోజులు ప్రవహించిన నీటి ప్రవాహాన్ని తట్టుకున్న విలాసాగర్ చెక్‌డ్యాం పగలు, రేయి తేడా లేకుండా ఆ ఒడ్డు, ఈ ఒడ్డు పట్టుకుని నీరు ప్రవహించిందని, మూడు, నాలుగు రోజుల క్రితం ఇసుక సరఫరా చేసే స్మగ్లర్‌లు అధికార పార్టీ నేతలతో పోలీస్ యంత్రాంగంతో, రెవెన్యూ యంత్రాంగంతో కుమ్మక్కై అర్ధరాత్రి పూట చెక్‌డ్యాం పేల్చివేయడంతో శబ్దాలు వినిపించాయని పక్కన ఉన్న గ్రామాల రైతులు మొరపెట్టుకుంటున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా దుయ్యబట్టారు. విలాసాగర్ చెక్‌డ్యాంతో పాటు నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో ఇసుక మాఫీయాలు కూల్చివేసిన చెక్‌డ్యాంలను తక్షణమే కాపర్‌డ్యాం.. రబ్బర్ డ్యాంలతో మరమ్మత్తులు చేసి నీరు వృదా పోకుండా ఆపి, వేసవి కల్ల పనులు పూర్తి చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ నేతల పింగిలి ప్రదీప్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా కెడిసిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, కన్నూరి సత్యనారయణరావు, పోల్నేని సత్యనారయణరావు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, గందె శ్రీనివాస్, ఇరుముల్ల సురేందర్‌రెడ్డి, కట్కూరి మల్లారెడ్డి, ఆకినపల్లి శీరిష, పావని, ముసిపట్ల తిరుపతిరెడ్డి, సరిగొమ్ముల వెంకటేష్, గాజుల భాస్కర్‌తో పాటు వందలాది మంది బిఆర్ఎస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

# ఐదు మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్25:** కొత్తగా ఐదు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకి నూతన పాలకవర్గాలను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలో తొగుట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, దౌల్తాబాద్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, మిర్‌దొడ్డి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ,చేగుం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ,దుబ్బాక అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలను నియమించారు. ఈ ఐదు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు చైర్ పర్సన్లను, వైస్ చైర్ పర్సన్లను,నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.వీటితో కలిపి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 178 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమించినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైనా మార్కెట్ కమిటీల పాలకవర్గ సభ్యులకు మంత్రి అభినందనలు తెలియచేశారు.

# మన ఊరు మన బడి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయండి

**డిప్యూటీ సిఎం భట్టికి మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి ఫోన్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్25:** తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మంగళవారం మండలిలోని ఆయన ఆఫీస్‌లో 'మన ఊరు మన బడి' కాంట్రాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను ప్రభుత్వం త్వరగా విడుదల చేసేందుకు సహాయం చేయాలని వారు గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ వారి సమస్యలు తెలుసుకుని, సానుకూలంగా స్పందించారు. వెంటనే రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు మన బడి కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే లేఖను రాసి కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పంపించారు. మన ఊరు మన బడి పనులు చేసిన వారు చిన్న కాంట్రాక్టర్లు అని, వారి బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.

# వ్యక్తుల కోసం ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ చేయడం లేదు: డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్25:** బీఆర్ఎస్ నేతలు ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ వారికి కావలసిన వారి కోసం, వ్యక్తుల కోసం చేశారు, అంతర్లీనంగా ఎంపిక చేసిన కొద్దిమందికే చేశారు. పాలసీ లేదు, క్యాబినెట్ అనుమతి కూడా లేదు. ఇండస్ట్రియల్ పార్కులో కావలసిన వారికి భూములను కన్వర్ట్ చేశారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. బీఆర్ఎస్ నేతలు ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్లు ఎన్ని చేశారు, ఎవరెవరికి చేశారో తొందరలోనే వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అలా చేయడం లేదు హైదరాబాద్ లో ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ఫర్ పాలసీనీ పారదర్శకంగా తీసుకువచ్చామన్నారు.. హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా చేయడం, రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడం అజెండాగా ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పాలసీనీ తీసుకువచ్చామన్నారు.. ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ అంశంపై ఉన్నతాధికారులతో లోతుగా చర్చించాం, భాగస్వాములతోనూ మాట్లాడం, క్యాబినెట్లో సుదీర్ఘంగా చర్చించామని బిఆర్ఎస్ నేతల మాదిరిగా వ్యక్తి కోసం, వ్యక్తుల కోసం మేము ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ చేయడం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు పేదలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందాలి, ప్రతి సంవత్సరం ఖర్చు పెరుగుతుంది, ప్రజలపై పన్నులు మోపే ఆలోచన లేదు, ఆదాయం సమకూర్చుకునే బాధ్యత ప్రభుత్వం పై ఉంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పాలసీని పారదర్శకంగా తీసుకొచ్చి అందరికీ అవకాశం ఇస్తూ 50 ఎస్ ఓ ఆర్ ప్రకారం 80 ఫీట్ల రోడ్లు ఉన్నవారికి అవకాశం ఇస్తే కన్వర్షన్ చేసుకుంటారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు.నాచారం, మౌలాలి, ఉప్పల్, జీడిమెట్ల, బాలనగర్, కూకట్పల్లి వంటి ఇండస్ట్రియల్ కాలనీలు 50 సంవత్సరాల క్రితం హైదరాబాద్ అవతల ఉండేవి. పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి ఆనాడు ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. 50 ఏళ్ల కాలంలో హైదరాబాద్ నగరం పెద్ద ఎత్తున విస్తరించి ఇండస్ట్రియల్ పార్కుల చుట్టూ పెద్ద ఎత్తున ఇళ్ళ నిర్మాణం జరిగిందన్నారు.. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి విముక్తి కలిగించేందుకు ప్రస్తుతం ఆ పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు బయటకి తరలించాల్సి ఉందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రత పెరిగి పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి హైదరాబాదు నగరానికి రావొద్దు అనేది ప్రభుత్వం ఆలోచన. ప్రస్తుతం ఇండస్ట్రియల్ పార్కుల్లో ఉన్న వ్యక్తులను ఒత్తిడి చేసి బయటికి పంపలేం, నగరాన్ని పొల్యూషన్ రెడ్ జోన్ ఆరంజ్ జోన్ల నుంచి విముక్తి కల్పించాలని కోర్టులు సూచించాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకే పారదర్శకంగా సమగ్ర ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పాలసీని తీసుకువచ్చాం అని తెలిపారు.

# మొదటి మూడురోజులు ఎలక్ట్రానిక్ డిప్‌ద్వారానే 'వైకుంఠ'దర్శన టోకెన్లు జారీ

**తిరుమల,నవంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి మొదటిమూడురోజులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారానే టిటిడి టోకెన్లు జారీచేస్తుంది. డిసెంబర్ 30,31, 2026 జనవరి 1వతేదీ దర్శన టోకెన్ల కోసం ఈనెల 27వతేదీ (రేపు)గురువారం నుండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 1వతేదీ వరకు అవకాశం కల్పించింది. జనవరి 2వతేదీ నుండి 8వరకు పూర్తిగా ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ నుండి భక్తులను అనుమతించి వైకుంఠమార్గం దర్శనం చేయిస్తారు. డిసెంబర్ 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజులు పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. ఆన్‌లైన్‌లో కుటుంబసభ్యులకు 1+3 విధానంలో టోకెన్లు నమోదు చేసుకోవడానికి టిటిడి అవకాశం కల్పించింది.

**రేపటి నుండి ఆన్‌లైన్‌లో డిప్ నమోదు:** మొదటి మూడురోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఈనెల 27వతేదీ ఉదయం 10గంటల నుండి డిసెంబర్ 1వతేదీ సాయంత్రం 5గంటలవరకు టిటిడి వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్:// టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్//,మొబైల్‌యాప్ యాప్స్.ఆపిల్.కామ్/ఇన్/యాప్/టిటిదేవ స్థానమ్స్/, వాట్సాప్‌లో ఏపి ప్రభుత్వబాట్‌లో టిటిడి ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెం బర్ 2వతేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎల క్ట్రానిక్ డిప్‌వివరాలు భక్తులకు అందించబడతాయి.

**-వాట్సాప్‌లో నమోదుకు:** వాట్సాప్‌బాట్‌ద్వారా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకునే భక్తులు ఏపిగవర్నమెంట్ సర్వీసెస్ నంబ్ 955 2300009కు ముందుగా గోవింద, హాయఅని మెసేజ్ చేయాలి. ఆ తరువాత ఆంగ్లం, తెలుగు భాషలను సెలక్ట్ చేసుకోవాలి. ఇంగ్లీష్‌కోసం ఇన్ అని, తెలుగుకోసం టిఇ అని జవాబివ్వాలి. అనంతరండిసెంబర్ 30,31,జనవరి 1వతేదీల్లో దర్శనంకావాల్సిన రోజును లేదా మూడురోజులను ప్రయారిటీగా ఎంపిక చేసుకోవచ్చు. తరువాత భక్తులు ఆధార్‌కార్డులో ఉన్న మేరకు పేరు, వయస్సు, లింగం,ఆధార్‌నంబర్, మొబైల్‌నంబర్‌ను నమోదు చేయాలి. వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

**మొదటి మూడురోజులు ఎస్ఇడి ,శ్రీవాణి రద్దు:** వైకుంఠద్వార దర్శనాల్లో మొదటి మూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో ఎస్ఇడి, శ్రీవాణి ,ఇతర ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. జనవరి 2నుండి8వరకు ఎస్ఇడి, శ్రీవాణి ఆన్‌లైన్ లో జారీచేస్తారు.కాగా స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించారు.

# కర్నూలు - విజయవాడ కొత్త రైలు

**రైల్వే మంత్రికి ఎపి మంత్రి టిజి భరత్ వినతి**

**విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమైన విధంగా పూర్తి సహకారం అందించాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ చెప్పారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసినట్లు టిజి భరత్ కలిశారు. పారిశ్రామిక లాజిస్టిక్‌లను బలోపేతం చేయడానికి, రాష్ట్ర ప్రధాన పారిశ్రామిక పార్కుల పోటీతత్వాన్ని పెంచడానికి ఓర్వకల్, శ్రీ సిటీ వద్ద రైల్వే సైడింగ్‌ల విషయంపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టిజి భరత్ పేర్కొన్నారు. అంతేకాకుండా కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైలు సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు, వ్యాపార వర్గాలకు రైలు సౌకర్యం ఉండటం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయనకు వివరించినట్లు తెలిపారు. దీనిపై కర్నూలు ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

# సుల్తాన్ అజ్లాన్ కప్‌లో భారత్ ఓటమి

## 2-3 తేడాతో బెల్జియం విక్టరీ




**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్-2025 టోర్నమెంట్‌లో భారత్ బెల్జియం చేతిలో పరాజయం పాలైంది. సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టును బెల్జియం 2-3 తేడాతో ఓడించింది. భారత్ తరపున అభిషేక్, శిలానంద్ లక్రా గోల్స్ కొట్టగా, బెల్జియం తరపున రోమన్ దువేకోట్ రెండు సార్లు, నికోలస్ డి కెర్పెల్ ఒక గోల్ మొత్తంగా 3 గోల్స్ చేశారు. భారత్ తొలి క్వార్టర్‌లో రెండు పెనాల్టీ కార్నర్‌లతో సహా బెల్జియం ఒత్తిడిని బాగా ఎదుర్కొంది. గోల్ కీపర్ పవన్ కీలక సేవ్‌లను అందించాగా, భారత్ క్రమంగా మరింత నియంత్రణ సాధించింది. అయితే 17వ నిమిషంలో దువేకోట్ పవన్‌ను ఓడించి బెల్జియం ఆధిక్యంలోకి వెళ్లింది. దిల్‌ప్రీత్ సింగ్ ద్వారా గోల్ సాధించినట్లు భారత్ భావించినా, ఆ గోల్ రద్దయింది. దీంతో బెల్జియం హాఫ్ టైం ముగిసే సమయానికి 1-0 ఆధిక్యంలో ఉంది. పునఃప్రారంభం తర్వాత భారత్ ప్లేయర్ అభిషేక్ 33వ నిమిషంలో గోల చేసి స్కోరును సమం చేశాడు. మూడవ క్వార్టర్ చివరిలో కెర్పెల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో బెల్జియం తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. నాల్గవది ప్రారంభంలో దువేకోట్ ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. భారత్ పట్టుదల కొనసాగించడంతో 57వ నిమిషంలో రబిచంద్ర సింగ్ క్రాస్ నుండి లక్రా ఒక గోల్‌ను వెనక్కి తీసుకున్నాడు. ఇది ఉత్కంఠభరితమైన ముగింపును ఏర్పాటు చేసింది. చివరి నిమిషాల్లో మోహిత్ హెచ్‌ఎస్ కీలకమైన సేవ్ చేసి బెల్జియన్ నాల్గవ గోల్‌ను సాధించి గెలుపొందిదింది.




### వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో

# తొలిసారి ఫైనల్స్‌కు భారత్

## బాలికల విభాగంలో కాంస్యం



**న్యూఢిల్లీ:** ప్రపంచ యువ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. భారత టేబుల్ టెన్నిస్ చరిత్రలో తొలి సారిగా, అండర్ 19 బాలుర జట్టు రొమేనియాలో జరిగిన ఈ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్స్‌లో బలీయమైన ప్రత్యర్థి చైనీస్ తైపీని ఓడించింది. రైజింగ్ స్టార్లు అంకుర్ భట్టాచార్జీ, పిబి అభినందన్ మరియు ప్రియానుజ్ భట్టాచార్యలతో కూడిన భారత జట్టు 3-2 తేడాతో విజయం సాధించిబంగారు పతకపోరుకు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో భట్టాచార్జీ భారతదేశానికి మంచి ఆరంభాన్ని అందించాడు, హ్సు హ్సి యెన్‌చియాపై తన మొదటి మ్యాచ్‌ను 3-2 తేడాతో గెలుచుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో కువో గువాన్‌హాంగ్ అభినందన్‌ను 3-1 తేడాతో ఓడించడంతో చైనీస్ తైపీ సమం చేసినప్పటికీ, భట్టాచార్య లిన్ చిన్‌టింగ్‌పై పోరాడి 3-2 తేడాతో భారత్‌ను తిరిగి ఆధిక్యంలోకి తెచ్చాడు. అయితే చైనీస్ తైపీ మరోసారి పోరాడి సమం చేసింది. కువో భట్టాచార్జీని వరుస గేమ్‌లలో 3-0 తేడాతో ఓడించాడు. కానీ మొదటి మ్యాచ్‌లో ఓడిపోయిన అభినంద్, హ్సుపై 3-0 తేడాతో విజయం సాధించి భారత్‌కు ప్రసిద్ధ విజయాన్ని నమోదు చేశాడు. అంతకుముందు, క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ ఫ్రాన్స్‌ను 3-0 తేడాతో ఓడించి, చైనీస్ తైపీతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. కాగా భారత అండర్ 15 బాలికల జట్టు సెమీఫైనల్లో దక్షిణ కొరియా చేతిలో 0-3 తేడాతో ఓడిపోయి కాంస్య పతకానికి పరిమితమైంది. అంకోలికా చక్రవర్తి, దివ్యాంశి భౌమిక్, అనన్య మురళీధరన్‌లతో కూడిన భారత జట్టు దక్షిణ కొరియన్లకు ఏమాత్రం సరితూగలేకపోయింది. ఈ అమ్మాయిలు అంతకుముందు క్వార్టర్ ఫైనల్స్‌లో జర్మనీని 3-1 తేడాతో ఓడించారు.




### ఫిఫా ప్రపంచ కప్:

# ఫైనల్‌కు పోర్చుగల్

**న్యూఢిల్లీ:** ఫిఫా అండర్17 ప్రపంచ కప్ టోర్నీలో పోర్చుగల్ పెనాల్టీ షూటౌట్‌లో బ్రెజిల్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. దీంతో ఈ నెల 27న జరిగే ఫైనల్‌లో ఆస్ట్రియా, పోర్చుగల్ తలపడనున్నాయి. అదే రోజు బ్రెజిల్, ఇటలీ మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ జరుగుతుంది. పోర్చుగల్, ఆస్ట్రియా రెండు జట్లూ తొలిసారి ఫైనల్‌కు చేరుకోవడంతో అండర్17 ఫిఫా ప్రపంచ కప్‌లో కొత్త ఛాంపియన్ వస్తాడు. సడన్ డెత్‌లో పోర్చుగల్ బ్రెజిల్‌ను 6-5 తేడాతో ఓడించగా, ఆస్ట్రియా ఇటలీని 2-0 తేడాతో ఓడించింది. టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ చేసిన మోజర్ (ఏడు ఆటల్లో ఎనిమిది గోల్స్) ఈ మ్యాచ్‌లో 57వ నిమిషంలో స్కోరింగ్‌ను ప్రారంభించి త్రూ బాల్‌ను గోల్‌గా మార్చాడు. రెండవ అర్ధభాగంలో స్టాపేజ్ సమయంలో అద్భుతమైన ఫ్రీ కిక్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఇక పోర్చుగల్, బ్రెజిల్ మధ్య జరిగిన మరో సెమీఫైనల్ చాలా క్లిష్టంగా మారింది. మొత్తం ఆటలో 35 ఫౌల్‌లు ఉండగా, 4 షాట్లు మాత్రమే ప్రతి వైపు నుండి రెండు లక్ష్యాన్ని చేరుకున్నాయి. అయితే, పోర్చుగల్ గోల్ కీపర్ రొమారియో కున్హా ఎట్టకేలకు గోల్‌ను కాపాడుకున్నాడు. మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌లకు దారితీసిన రెండు ప్రయత్నాలను అడ్డుకున్నాడు. రెండు జట్లు మొదటి నాలుగు స్పాట్ కిక్‌లను గోల్‌గా మార్చాయి. కున్హా పోర్చుగల్ తరపున ఐదవ పెనాల్టీని మిస్ చేసి, దాన్ని బార్ మీదుగా షూట్ చేశాడు. బ్రెజిల్ ఆట గెలిచే పరిస్థితిలో రువాన్ పాబ్లో వుడ్‌వర్క్‌ను కొట్టాడు. జోస్ నెటో పోర్చుగల్ తరపున ఏడవ పెనాల్టీని గోల్ చేశాడు. ఇదే సమయంలో ఏంజెలో కాండిడో బ్రెజిల్ తరపున గోల్ చేయడంలో విఫలమయ్యాడు. దీంతో పోర్చుగల్ తన మొట్టమొదటి అండర్ 17 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది.

# టెస్టులో విజయం దిశగా సౌతాఫ్రికా

## 522 రన్స్ వెనుకబడిన టీమిండియా




**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం దిశగా దూసుకువెలుతోంది. 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (2), కుల్దీప్‌యాదవ్ (4) లు క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించడానికి ఆఖరి రోజు 8 వికెట్లు అవసరం కాగా భారత్ గెలవాలంటే 522 పరుగులు చేయాల్సి ఉంది. 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓ సిక్స్, ఓ ఫోర్ కొట్టి ఊపుమీద కనిపించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ 13 రన్స్‌కే ఔట్ అయ్యాడు. మార్కో జాన్సెస్ బౌలింగ్ షాట్‌కు యత్నించగా బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో భారత్ 17 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయింది. ఇక మరికాసేపటికే ఆరంభం నుంచి ఇబ్బంది పడుతున్న కేఎల్ రాహుల్ (6) స్పిన్నర్ సైమన్ హార్మర్ చేతిలో క్లీన్ బౌల్డ్ అయ్యాడు.

దీంతో భారత్ 22 రన్స్‌కు 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. నైట్ వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్‌తో కలిసి వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ మరో వికెట్ పడకుండా రోజును ముగించారు. అంతకముందు నాలుగో రోజు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 5 వికెట్ల నష్టానికి 260 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్ (94) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. టోని డి జోర్జి (49), రికెల్టన్ (35), వియాన్ ముల్డర్ (35 నాటౌట్) రాణించారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా 4 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్ పడగొట్టాడు. కాగా ఈ మ్యాచ్‌లలో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు చేసింది. ఆ తరువాత భారత్ 201 పరుగులకు ఆలౌటైంది. దీంతో 288 పరుగుల ఆధిక్యం సఫారీలకు లభించింది.

### టి20 వరల్డ్ కప్‌లో

# పాక్‌తో భారత్ బిగ్ ఫైట్

## ఫిబ్రవరి 15న దాయాదుల పోరు




**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై జరగనున్న టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, పాకిస్థాన్ మధ్య మరోసారి బిగ్ ఫైట్ జరగనుంది. ఫిబ్రవరి 15న ఈ హై వోల్టేజ్ మ్యాచ్ మ్యాచ్ శ్రీలంక వేదిక కాబోతోంది. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ ఖరారైంది. తొలిసారి ఈ మెగా టోర్నీకి అర్హత సాధించిన 20 టీముల్లో భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, యూఎస్ఏ, వెస్టిండీస్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఐర్లాండ్, కెనడా, ఇటలీ, నెదర్లాండ్స్, జింబాబ్వే, నమీబియా, ఒమన్, నేపాల్, యూఏఈ ఉన్నాయి. ఐదు జట్లు 4 గ్రూప్ లుగా విభజించబడతాయి. తొలి 2 స్థానాల్లో నిలిచిన జట్లు తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. సూపర్8లో మొత్తం 8 జట్లు 4 జట్లతో రెండు గ్రూప్‌లుగా విభజించబడతాయి. ఒక్కో జట్టు మిగిలిన టీముతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. నాలుగింటిలో టాప్2 లో ఉన్న జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో ఇండియా, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. వీటితో పాటు, యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ కూడా ఇందులో ఉన్నాయి. పాకిస్థాన్ తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకలోని ఆడనుంది. టీమిండియా షెడ్యూల్ చూస్తే ఫిబ్రవరి 7న ప్రారంభ మ్యాచ్ లో యూఎస్ఏ తో తలపడుతుంది. ముంబై వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. ఫిబ్రవరి 12 న నమీబియాతో ఢిల్లీ వేదికగా, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో ఫిబ్రవరి 15న కొలంబోలో, లీగ్ దశలో చివరి మ్యాచ్ నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్ వేదికగా ఆడనుంది. సూపర్8కు అర్హత సాధిస్తే వరుసగా మూడు మ్యాచ్‌లు అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా వేదికలుగా జరుగుతాయి. భారత జట్టు సెమీ ఫైనల్ కు వస్తే ముంబైలో, ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లో ఆడనుంది.

# ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి రిలయన్స్




**ముంబయి, నవంబరు 25:** భారత స్టాక్ మార్కెట్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు రికార్డులు సృష్టిస్తున్నాయి. దేశంలోనే అత్యంత విలువైన ఈ కంపెనీ షేరు, మంగళవారం ట్రేడింగ్‌లో ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికిచేరి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. ఈ ర్యాలీతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్లకు చేరింది. ఈరోజు ఉదయం ట్రేడింగ్‌లో రిలయన్స్ షేరు దాదాపు 2 శాతం లాభపడి, ఇంట్రాడేలో రూ. 1559.60 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇదే ఈ షేరుకు 52 వారాల గరిష్ఠ ధర కూడా కావడం విశేషం. ఈ స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర రూ. 1114.85 కాగా, అక్కడి నుంచి సుమారు 40 శాతం మేర వృద్ధి చెందింది. రిలయన్స్ షేరు తాజా ర్యాలీకి ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ జెపి మోర్గాన్ ఇచ్చిన నివేదికే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జెపి మోర్గాన్ ఈ స్టాక్‌కు ఓవర్‌వెయిట్ రేటింగ్ ఇచ్చింది. అంతేకాకుండా ప్రస్తుత ధర నుంచి 11 శాతం అధికంగా రూ. 1727 టార్గెట్ ధరను అంచనా వేసింది. ఈ సానుకూల నివేదికతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు ఇటీవల వెలువడిన రెండో త్రైమాసిక (క్యూ2) ఫలితాల్లో కంపెనీ నికర లాభం 9.6 శాతం పెరగడం కూడా షేరుకు కలిసొచ్చింది. గత కొంతకాలంగా ఈ షేరు నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 27 శాతం, గత ఐదేళ్లలో 60 శాతానికి పైగా లాభాలను అందించింది.

# రెపోరేట్లు తగ్గుతాయన్న సంకేతాలు!




**ముంబయి, నవంబరు 25:** రుణ గ్రహీతలకు త్వరలో శుభవార్త అందే సూచనలు కనిపిస్తున్నాయి. వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని భారత రిజర్వ్‌బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. రెపో రేటు కోతకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కీలక సంకేతాలిచ్చారు. అక్టోబర్‌లో జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసీ) సమావేశంలోనే భవిష్యత్ రేట్ల కోతపై సూచనలు ఇచ్చామని, ఆ తర్వాత వెలువడిన స్థూల ఆర్థిక గణాంకాలు కూడా సానుకూలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా, అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతం వద్ద రికార్డు కనిష్టానికి చేరడం రేట్ల తగ్గింపునకు మార్గం సుగమం చేస్తోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆహార పదార్థాల ధరలు తగ్గడం, వినియోగ వస్తువులపై పన్నుల కోత వంటివి ఇందుకు దోహదపడ్డాయి. 2025 ప్రథమార్ధంలో ఎంపిసి రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి దాన్ని స్థిరంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల (డిసెంబర్)లో జరగనున్న కమిటీ సమావేశంలో రేట్ల కోతపై తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ వెల్లడించారు. ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతంగా ఉంది. ఒకవేళ డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే అది 5.25 శాతానికి చేరుతుంది. అదే జరిగితే గృహ, వాహన, ఇతర రుణాలపై ఇఎంఐల భారం గణనీయంగా తగ్గుతుంది. ఆర్బీఐ గవర్నర్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వ పదేళ్ల బాండ్ల రాబడులు నాలుగు పాయింట్లు తగ్గి 6.48 శాతానికి చేరాయి.



# లేఆఫ్‌ల బాటలో యాపిల్ కూడా!

**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 25:** ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్నాలజీ కంపెనీ యాపిల్ తన గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్‌లో డజన్లకొద్దీ ఉద్యోగాలను తొలగించింది. సాధారణంగా భారీ లేఆఫ్స్‌కు దూరంగా ఉండే యాపిల్‌లో ఈ పరి ణామం అత్యంత అరుదు అని చెపుతున్నారు. రెండు వారాల్లో ప్రభావిత ఉద్యోగులకు యాజమాన్యం సమాచారం అందించినట్లు వార్తలు వెలువడ్డాయి. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ ఏజెన్సీలతో పనిచేసే సేల్స్ బృందాలపై ఈ కోతల ప్రభావం పడింది. వీరితో పాటు, కొత్త కస్టమర్లకు ఉత్పత్తి డెమోలు ఇచ్చే బ్రీఫింగ్ సెంటర్ల సిబ్బందిని కూడా తొలగించారు. అయితే, మొత్తం ఎంతమందిని తొలగించారనే దానిపై కంపెనీ స్పష్టతను ఇవ్వ లేదు. ఈ విషయంపై యాపిల్ స్పందిస్తూ తమ కార్పొరేట్ సేల్స్ నిర్మాణాన్ని పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు ధ్రువీకరించింది. మరింత ఎక్కువ మంది కస్టమర్లతో అనుసంధానం కావడానికి, మాసేల్స్ బృందంలో కొన్నిమార్పులు చేస్తున్నాం. దీనివల్ల తక్కువసంఖ్యలో ఉద్యోగాలపై ప్రభావం పడుతుంది. మేము నియామకాలు కొనసాగిస్తున్నాం. ప్రభావితమైన ఉద్యోగులు కొత్త పాత్రలకు దరఖాస్తు చేసుకోవచ్చని యాపిల్ ప్రతినిధి ఒకరు తెలిపారు. తొలగించిన వారిలో 20నుంచి 30 ఏళ్ల అనుభవం ఉన్న మేనేజర్లు కూడా ఉన్నారు. ఉద్వాసనకు గురైన వారు జనవరి 20లోగా కంపెనీలో మరో ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉంటుంది, లేదంటే సెవరెన్స్‌తో పాటు వారిని విధులనుంచి తొలగిస్తారు. ఒకవైపు రికార్డు స్థాయిలో దాదాపు 140 బిలియన్‌డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తూనే, యాపిల్ ఈనిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగామారింది. అమెజాన్, మెటా వంటి ఇతర టెక్ దిగ్గజాలు కూడా ఇటీవల ఉద్యోగాల కోతలు ప్రకటించిన నేపథ్యంలో యాపిల్ కూడా అదే బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది.

### జిడిపిలో 6%కి కుటుంబీకుల

# ఆదాయ వనరులు

## 2025లో రూ.9.9 లక్షలకోట్లు అని ఆర్థికశాఖ అంచనా




**న్యూఢిల్లీ, నవంబరు 25:** దేశంలో కుటుంబీకుల ఆదాయం ఇప్పటివరకూ ఉన్న పరిస్థితులను పరిశీలిస్తే రూ.9.9 లక్షలకోట్లుగా ఉంది. అంటే జిడిపిలో 6శాతంగా ఉన్నట్లు అంచనా. అంతకుముందు సంవత్సరంలో 5.3శాతంగా ఉన్న ఈ రాబడులు ఈఏడాది గణనీయంగా పెరిగాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇక కుటుంబాల్లో నెలకొన్న ఆర్థిక రుణాలు కూడా గత ఏడాదితో చూస్తే గణనీయంగా తగ్గాయన్నారు. మొత్తంగా 2025 ఆర్థిక సంవత్సరంలో 15.7 లక్షలకోట్ల వ్యయాలుమాత్రమే ఉన్నట్లు తెలిపారు. నికరంగా కుటుంబాల్లో ఆస్తులు 9.9 లక్షలకోట్లకు పెరిగినట్లు తేలింది. రెండేళ్లక్రితం కుటుంబాల్లో ఉన్న పొదుపు జిడిపిలో 4.9శాతంగా నమోదయ్యాయి. 1970 తర్వాత అత్యంత తక్కువస్థాయిలో గృహవాసుల్లో పొదుపు నమోదుకావడం ఇదే తొలిసారి. అలాగే ఇక కుటుంబీకుల్లో రుణభారం కూడా అంతకుముందు త్రైమాసికంలో రూ.18.8 లక్షలకోట్లవరకూ ఉంటే అదికాస్తా జిడిపిలో 4.7శాతానికి తగ్గింది. అంటే 15.7 లక్షలకోట్లుగా ఉంది. వీటన్నింటిని పరిగణనలోనికి తీసుకుని పరిశీలిస్తే రుణభారం గణనీయంగా 16 శాతంనుంచి 12శాతానికి తగ్గినట్లు తెలుస్తోంది. అరక్షిత, రిటైల్‌రుణాల్లో నిబంధనలు కఠినతరం చేయడం కూడా ఇందుకు ఒకకారణంగా చెప్పుకోవచ్చు. ఇక బంగారం తనఖా రుణాలు మాత్రం పెరుగుతున్నాయి. అత్యధికంగావేగంగా లభించే రుణసదుపాయం కావడంతో కుటుంబీకులు బంగారంపై తాకట్టురుణాలకు ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. ఇక మార్కెట్ అనుసంధానిత ఉత్పత్తులపరంగా చూస్తే కుటుంబీకుల ఆర్థికవనరుల్లో 15.1శాతంగా ఉన్నాయి. గత ఏడాది 8.7శాతంగానూ, 2023లో 7.3శాతంగాను నమోదయ్యాయి. దీన్నిబట్టిచూస్తే గృహవాసులకు మూలధన మార్కెట్లపై విశ్వాసం పెరుగుతోంది. అదే సమయంలో బ్యాంకు డిపాజిట్ల వాటా కూడా 35.2శాతం తగ్గింది. తక్కువ రిటర్నులు ఇచ్చే సాంప్రదాయ పొదుపు పథకాలనుంచి డిపాజిటర్లు బదలీ కావడమే ఇందుకు మూలం.

### నిరుద్యోగ సమస్యకు కొత్త కార్మికచట్టాలతో

# పరిష్కారం



## ఎస్బీఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ,నవంబరు 25:** నిరుద్యోగ సమస్యకు అమలులోకి వచ్చిన కార్మిక చట్టాలు పరిష్కారం చూపే అవకాశం ఉందని భారతీయ స్టేట్‌బ్యాంకు రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈచట్టాల అమలుతో నిరుద్యోగం 1.3 శాతం వరకు తగ్గి, దాదాపు 77 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని తాజాగా విడుదల చేసిన నివేదికలో అంచనావేసింది. ఈ ఉపాధి కల్పనతో పాటు వినియోగం కూడా భారీగా పెరగనుందని ఎస్‌బిఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఒక్కో వ్యక్తి రోజువారీ వినియోగం రూ.66 పెరిగి, దేశవ్యాప్తంగా వినియోగ వ్యయం సుమారు రూ.75,000 కోట్లకు చేరుకుంటుంది. ఇది వినియోగానికి పెద్ద మద్దతునిస్తుందని ఆయన వివరించారు. దేశంలో 44 కోట్లమంది అసంఘటిత రంగంలో పనిచేస్తుండగా, వీరిలో 31 కోట్ల మంది ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యారు. కొత్త చట్టాల వల్ల వీరిలో కనీసం 20 శాతం మంది, అంటే దాదాపు 10కోట్ల మంది సంఘటిత రంగం లోకి మారతారని నివేదిక అంచనా వేసింది. దీంతో దేశంలో సంఘటిత రంగ కార్మికుల వాటా 60.4 శాతం నుంచి 75.5 శాతానికి పెరుగుతుందని పేర్కొంది. రాబోయే 23 ఏళ్లలో సామాజిక భద్రత పరిధి 8085 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం 2019,2020 సంవత్సరాల్లో పార్లమెం టులో ఆమోదించిన నాలుగు కార్మిక కోడ్‌లను ఈ నెల 21నుంచి అమలులోకి తెచ్చిన విషయం తెలి సిందే. ఈ సంస్కరణలు కార్మికులు, యాజమా న్యాలు ఇద్దరికీ సాధికారత కల్పిస్తాయని, తద్వారా దేశం మరింత పోటీతత్వంతో స్వావలంబన దిశగా పయనిస్తుందని నివేదిక అభిప్రాయపడింది.

### మూడోరోజూ మార్కెట్లకు

# తప్పని నష్టాలు!



**ముంబయి, నవంబరు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడోరోజు కూడా స్వల్ప నష్టాలతో గట్టెక్కాయి. నెలవారీ డెరివేటివ్స్ కాల పరిమితి ముగుస్తుండటం, రూపాయి కొంతమేర మెరుగుపడటం వంటివి మార్కెట్లలో అమ్మకాలకు బీజంవేసాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 313.70 పాయింట్లు క్షీణించి 84,587.01 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 50 సూచీ 74.70 పాయింట్లు క్షీణించి 25,884.80 పాయింట్లుగా ట్రేడింగ్ ముగించింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.22శాతం, నిఫ్టీ 1.17 శాతం క్షీణిం చాయి. ఆదాని సంస్థలు 2.71శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.92శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.73 శాతం నష్టపోయాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.19శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.20శాతం వరకూ పెరుగుదల సూచించింది. మార్కెట్లపరంగా చూస్తే బిఎస్ఇలో 2095 కంపె నీల షేర్లు పెరిగాయి. 2076 కంపెనీలు కొంతమేర క్షీణించాయి. 171 కంపెనీలషేర్లు మాత్రం స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.54శాతం క్షీణించి 6.490కి చేరాయి. విదేశ ఈ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 89.18వద్ద మారకం నడిచింది. ఎంసి ఎక్స్‌లో గోల్డ్ ఫ్యూయచర్స్ డిసెంబరు ఐదో తేదీనాటికి 0.87శాతంగా పెరిగి 1,24,927కి చేరింది. ఇక అమెరికా పదేళ్ల బాండ్లుకూడా 0.17 శాతం పెరిగి 4.028గా నడిచింది. ఇక స్టాక్స్ పరంగాచూస్తే ముత్తూట్ మైక్రోఫిన్ 5.95శాతంగా ఉంది. భారత్ ఎలక్ట్రానిక్స్ కూడా 1.57శాతంగా ఉంది. మాక్స్ ఇండియా 2.41శాతంగా పెరిగితే ఏసిఎంఇ సోలార్ హోల్డింగ్స్ 1.67శాతంగా ఉంది. తెఇఓలయ రోష్నీ 1.91శాతం పెరిగింది. అలాగే స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్స్ 3.29శాతం పెరిగింది. కంపెనీకి కొత్త ఎండి రాక కూడా కొంత మద్దతునిచ్చింది. గ్లెన్‌మార్క్ ఫార్మాక్యూటికల్స్ 2.10శాతంగా ఉంది. డెస్కో ఇన్‌ఫ్రాటెక్ 5.39 శాతం ర్యాలీతీసింది. వన్‌పాయింట్‌వన్ సొల్యూ షన్స్ మూడుశాతం పెరిగాయి. ఇక ఐపిఓల పరంగాచూస్తే సుదీప్‌ఫార్మా అంచనాలకు మించి బిడ్లు రాబట్టింది. 98,72,92,575 షేర్లకు బిడ్లు వచ్చినట్లు ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.